ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
శుక్రవారం 26 జూలై 2024



బైరాపురంలో పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

ఎరపంటలతో తెగుళ్ల నివారణ

ఏడీఏ విద్యావతి

కొత్తచెరువు, జూలై 25: రైతులు వేరుశనగ, ఇతర పంటలు సాగుచేసేటపుడు పొలం చుట్టూ ఎరపంటలు వేసుకుంటే తెగుళ్లను నివారించవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ విద్యావతి తెలిపారు. మండలంలోని బైరాపురం గ్రామంలో చిన్నారప్ప సాగుచేసిన వేరుశనగ పంటలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ విద్యావతి మాట్లాడుతూ.. వేరుశనగ పంటను పచ్చపురుగు ఇతర తెగులు ఆశించకుండా ఎరపంటలుగా మొక్కజొన్న, జొన్న, సజ్జ నాలుగు వరుసల చొప్పున సాగు చేయాలన్నారు. లద్దె, పచ్చపురుగు బెడదను తగ్గించుకోవడానికి పంట చుట్టూ ఆముదం పంటను, రసం పీల్చే పురుగు నివారణకు బంతిపూలు, పొద్దుతిరుగుడు పూల మొక్కలు సాగుచేయాలని సూచించారు. వ్యవసాయాధికారుల సూచన మేరకు పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓలు నటరాజ్, అబ్దుల్ అలీ, శశిధర్ రెడ్డి, వీఏఏలు పాల్గొన్నారు.

ఇంకానా..!

తనకల్లు, జూలై 25: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసి 50 రోజులు కావస్తోంది. నేటికీ బియ్యం సరఫరా చేసే ఎండీయూ వాహనాలపై మాజీ సీఎం జగన్ బొమ్మే కనిపిస్తోంది. ఎన్నికల సమయంలోనే తొలగించాల్సిన అధికారులు పట్టించుకోలేదు. పాలక పక్షం మారి 50 రోజులవుతున్నా.. జగన్ బొమ్మ తొలగించకపోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సీఎస్‌డీటీలు, రెవెన్యూ అధికారులు నేటికీ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. మండలంలోని కోటపల్లి, మల్లిరెడ్డిపల్లి పంచాయతీలకు బియ్యం సరఫరా చేసే బండిపై మాజీ సీఎం బొమ్మ ఉండడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు మేల్కొని, బియ్యం బండిపై ఉన్న జగనన్న బొమ్మ తొలగిస్తారో.. లేదో.. మరి. ఈవిషయంపై సీఎస్‌డీటీ అనిల్‌కుమార్‌ను అడగ్గా.. ఎన్నికల సమయంలో బియ్యం బండిపై స్టికర్లు అతికించామన్నారు. మాజీ సీఎం బొమ్మ తొలగించని విషయం తన దృష్టికి వచ్చిందనీ, త్వరలోనే దానిపై పెయింటింగ్ వేయిస్తామని చెప్పుకొచ్చారు.



ఎండీయూ వాహనంపై తొలగించని జగన్ బొమ్మ



కూటమికి జై..!

పార్టీ మారేందుకు వైసీపీ ఎంపీటీసీలు సై

పురంలో రంగం సిద్ధం..
ఇప్పటికే టీడీపీ టచ్‌లోకి మెజార్టీ సభ్యులు

హిందూపురం, జూలై 25: రాష్ట్రంలో పాలకపక్షం మారిన నేపథ్యంలో స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు సైతం ఇక వైసీపీలో ఉండి శూన్యమని భావించి టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడి 50రోజులు కావస్తున్న నేపథ్యంలో మండలాల్లోని ఎంపీటీసీలు కండువా మార్చడానికి సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే అధికార పార్టీ నాయకులతో సంప్రదింపులు సాగిస్తున్నారు. 2021లో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పోటీ నుంచి విరమించుకోవడంతో అప్పట్లో ఎలెక్షన్ మాదిరికాకుండా సెలెక్షన్ తరహాలో ఎంపికయ్యారు. ఎన్నడూలేనివిధంగా వైసీపీలో పదవులు పొందిన వారు చాలామంది రాజకీయాల్లోకి కొత్తగా ప్రవేశించినవారు కావడంతో గత మూడేళ్లకుపైగా అధికారాన్ని చెలాయించారు. సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో వైసీపీ వారికి ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు జరగవని భావించారు. ఈ తరుణంలో ఎలాగైనా పదవీకాలం అధికార పార్టీలోనే కొనసాగాలని భావిస్తున్నారు. ఈ తరుణంలో హిందూపురం నియోజకవర్గంలో మూడు మండలాలు ఉండగా అన్నిచోట్లా ఎంపీటీసీలు టీడీపీలోకి రావడానికి సిద్ధమైనట్లు సమాచారం. ఎంపీపీలు సైతం టీడీపీ వారుంటే అభివృద్ధి పనుల్లో కొంత ముందంజ అవుతుందని ముఖ్య నాయకులు కూడా భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో నియోజకవర్గంలో ఎంపీపీల మార్పు ఉండవచ్చన్న ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి.

సర్వం సిద్ధం

నియోజకవర్గంలో హిందూపురం రూరల్, లేపాక్షి, చిలమత్తూరు మండలాలున్నాయి. హిందూపురం మండలంలో మొత్తం 15 మంది ఎంపీటీసీలు ఉండగా నలుగురే టీడీపీ మద్దతుదారులు. మిగిలినవారంతా వైసీపీ వారే. ప్రస్తుతం టీడీపీ వారు కాకుండా మరో ఆరుగురు టీడీపీ టచ్‌లోకి వచ్చారు. వారు కండువా మార్చడానికి సిద్ధంగా ఉన్నా.. ఎమ్మెల్యే ఇంకా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు. లేపాక్షి మండలంలో 14 మంది ఎంపీటీసీలుండగా తెలుగుదేశం పార్టీ వర్గీయులు ముగ్గురే. ఇక్కడ కూడా ఇప్పటికే ఏడుగురి దాకా తెలుగుదేశం వైపు మొగ్గు చూపుతున్నారు. చిలమత్తూరు మండలంలో 14 మంది ఎంపీటీసీలుండగా.. ప్రస్తుతం అక్కడ టీడీపీ బలం ఆరుకు చేరింది. మరో నలుగురు టీడీపీలోకి రావడానికి సిద్ధంగా ఉన్నారు. ఇక్కడ కూడా అధిష్టానం ఓకే అంటే తెలుగుదేశం బలం 10కి చేరే అవకాశం ఉంది. హిందూపురం ఎంపీపీ ఎస్సీ మహిళ రిజర్వేషన్. దీంతో తెలుగుదేశం పార్టీకి చెందిన ముఖ్య నాయకుడి పంచాయతీ ఎంపీటీసీ సభ్యురాలు ఉండటంతో ఆమెను ఎంపీపీ చేసుకునేందుకు సుముఖంగా ఉన్నట్లు చర్చ సాగుతోంది. లేపాక్షి ఎంపీపీ మహిళ రిజర్వేషన్ కావడంతో అక్కడ కూడా ముఖ్య నాయకుడి భార్యఇప్పటికే టీడీపీ తరఫున ఎంపీపీ రేసులో ఉండటంతో ఆమెకు అవకాశం దక్కవచ్చని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి. చిలమత్తూరు మండలంలో ఎంపీపీకి సంబంధించి కొంత తర్జనభర్జన సాగుతోంది. ఇక్కడ ఎంపీపీ స్థానం జనరల్ కావడంతో వైసీపీ నుంచి టీడీపీలో చేరినవారే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఎంపీపీ పదవి ఎవరికి దక్కుతుందో అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇక్కడ కూడా ఎంపీపీ పదవి ఇస్తామంటే వైసీపీ నుంచి టీడీపీలోకి రావడానికి జనరల్ ఎంపీటీసీ సిద్ధంగా ఉన్నాడు. ఈ మండలంలో అధికార పార్టీలో వర్గాలుండటంతో ఇక్కడ ఎమ్మెల్యే ఆశీస్సులు ఎవరికి ఉంటే వారే అవుతారని తెలుగుదేశం పార్టీ నాయకులు చెప్పుకుంటున్నారు.



అభివృద్ధికి ఆటంకం ఉండదు

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పంచాయతీలు, మండలాలకు నిధులు వచ్చిన దాఖలాల్లేవు. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ఇక నిధులు వస్తాయని భావిస్తున్నారు. ఇప్పటికే హిందూపురం నియోజకవర్గంలోని మూడు మండలాలకు రూ.100కోట్ల నిధుల విడుదలకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఒకే చేశారు. ఆ ఫైల్ రేపోమాపో జిల్లా కలెక్టర్‌కు చేరనుంది. మండల గ్రాంట్లు వచ్చినపుడు ఎంపీపీల ఆమోదంపై ఆధారపడి ఉంటుంది. దీంతో తెలుగుదేశం పార్టీకి చెందినవారే ఎంపీపీలుగా ఉంటే పల్లెలు మరింత అభివృద్ధి చెందుతాయని అధికార పార్టీ నాయకులు భావిస్తున్నారు. ఇదే సందర్భంలో వైసీపీ నుంచి గెలుపొందినవారు కూడా ఈ పార్టీలో ఉండటం కంటే టీడీపీలోకి వెళ్లిపోవడమే నయమని భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో హిందూపురం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ఎంపీపీల మార్పు తథ్యమని భావిస్తున్నారు. ఇవన్నీ ఇలా ఉంటే నాలుగేళ్లపాటు ఎంపీపీల మార్పునకు అవకాశం ఉండదని వైసీపీ నాయకులు అంటున్నారు. ఏది ఏమైనా హిందూపురం నియోజకవర్గంలో అధికార పార్టీవైపు చూస్తుండగా కొంతమంది టీడీపీ నాయకులు ఎంపీపీ పదవుల కోసం ఆరాట పడుతున్నట్లు తెలుస్తుంది. దీనిపై ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఎలా స్పందిస్తారో వేచిచూడాల్సిందే.



ఏఓకి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

గత ప్రభుత్వ విధానాలతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తం

117 జీఓను రద్దు చేయాలి

యూటీఎఫ్ నాయకుల డిమాండ్

పుట్టపర్తి, జూలై 25: గత ప్రభుత్వం అమలు చేసిన విధానాల కారణంగా విద్యా వ్యవస్థ అస్తవ్యస్తమైందని యూటీఎఫ్ నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి ఏఓ వసుంధరాదేవికి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ నాయకుడు శెట్టిపి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ.. జీఓ నంబరు 117ను రద్దుచేయాలన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన విధానాల కారణంగా ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు విశ్వాసం సన్నగిల్లిందన్నారు. దీనిని నూతన ప్రభుత్వం చక్కదిద్దాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలనీ, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలనీ, కోవిడ్ సమయంలో మరణించిన మోడల్ స్కూల్ టీచర్ల కుటుంబీకులకు కారుణ్య నియామకాలు చేపట్టాలనీ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, భూతన్న, బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

ఎస్పీ రత్న

కదిరి/నల్లమాడ, జూలై 25: అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ రత్న పేర్కొన్నారు. కదిరి, నల్లమాడలో పోలీసు స్టేషన్లను ఆమె గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, శాంతిభద్రతలపై సమీక్షించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. మట్కా, పేకాట, గంజా యి, నాటుసారా, చట్ట వ్యతిరేక కార్యక్రమాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో కదిరి డీఎస్పీ శ్రీలత, సీఐలు పుల్లయ్య, వెంకటేశ్వర్లు, మోహన్, రాజేంద్రనాథ్ యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.



కదిరి పోలీసు స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

ఆఖర్లో బరితెగింపు..!

రేషన్ బియ్యం బొక్కేశారు..
బయోమెట్రిక్ వేయించుకుని..
బియ్యం ఇవ్వని వైనం
కార్డుదారుల ఆవేదన

మడకశిర రూరల్, జూలై 25: గత వైసీపీ పాలనలో ఆ పార్టీ అండతో రేషన్ షాపులు దక్కించుకున్న వారు ఐదేళ్లూ బియ్యం బొక్కేశారు. అది చాలదన్నట్లు చివర్లో మరింత రెచ్చిపోయారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ఎఫ్‌పీ షాపుల డీలర్లను మార్చేస్తున్నారు. దీంతో వైసీపీ వర్గీయులు షాపులను వదులుకోవాల్సి వస్తోంది. దోపిడీకి ఇదే అదను అనుకున్నారు. ఆఖర్లో అడిగేవారెవరన్న చందంగా రెచ్చిపోతున్నారు. జూన్, జూలై కోటా బియ్యం చాలాచోట్ల బొక్కేశారు. కార్డుదారులతో వేలిముద్రలు వేయించుకుని, బియ్యం ఇవ్వలేదు. పలుచోట్ల స్టాక్ రాలేదంటూ చెప్పేసి, బియ్యం పక్కదారి పట్టించారు. మండలంలో 60 ఎఫ్‌పీ షాపులు, 16 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. 25,606 కార్డులున్నాయి. ప్రతినెలా దాదాపు 4 వేల క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేస్తున్నారు. జూన్‌లో 89.5 శాతం, జూలైలో 90 శాతం కార్డుదారులకు బియ్యం పంపిణీ చేసినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. అందులో చాలా మందికి బియ్యం పంపిణీ చేయకుండానే బయోమెట్రిక్ వేయించుకున్నట్లు తెలుస్తోంది.

జూన్‌లో బియ్యం ఇవ్వలేదు: భాగ్యమ్మ, కార్డుదారురాలు, మడకశిర

జూన్ నెలలో మాకు రేషన్ బియ్యం ఇవ్వలేదు. పలుమార్లు షాపు వద్దకెళ్లినా.. బియ్యం వేస్తాం అంటూనే నెల గడిపేశారు. జూలైలో బియ్యం వేశారు. జూన్ నెల కోటా బియ్యం అడిగితే స్టాక్ లేదన్నారు.



పురంలో కాగడాల ర్యాలీ

భరతమాత ముద్దుబిడ్డలకు జోహార్

ఘనంగా కార్గిల్ దివస్

హిందూపురం అర్బన్, జూలై 25: కార్గిల్ యుద్ధంలో వీరోచిత పోరాటం చేసిన సైనికులు భరతమాత ముద్దుబిడ్డలని బీజేపీ నాయకులు కొనియాడారు. కార్గిల్ దివస్‌ను పురస్కరించుకుని గురువారం అమరవీరులను స్మరిస్తూ పట్టణంలో చిన్నమార్కెట్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు కాగడాలతో ర్యాలీ చేపట్టారు. 'జయహో భారత్, జై జవాన్' నినాదాలతో హోరెత్తించారు. కార్గిల్‌ను, లడ్డాక్‌ను ఆక్రమించాలని పాకిస్థాన్ ఎత్తైన కొండ ప్రాంతం నుంచి తూటాలు పేలుస్తూ విశ్వ ప్రయత్నాలు చేసిందన్నారు. భారత సైనికులు వీరోచిత పోరాటం చేసి, వారిని తరిమి కొట్టారన్నారు. 4 వేల మంది శత్రు సైనికులను మట్టికరిపించారన్నారు. దేశం కోసం ప్రాణాలు లెక్క చేయకుండా పోరాడిన వీరులను స్మరిస్తూ కాగడాలతో అఖండ ధర్మదీపాన్ని వెలిగించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రవితేజారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శివ, బీజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్ దేవేంద్ర, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కూటమి నాయకుల కొవ్వొత్తుల ర్యాలీ

ముదిగుబ్బ: కార్గిల్ దివాస్‌ను పురస్కరించుకుని అమరవీరులకు స్థానిక బస్టాండు కూడలిలో కూటమి నాయకులు నివాళి అర్పించారు. కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కూటమి నాయకులు మాట్లాడుతూ.. 1999 మే 3 నుంచి జూలై 26 వరకు కొనసాగిన కార్గిల్ యుద్ధంలో ఎంతోమంది సైనికులు అమరులయ్యారన్నారు. వారికి నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ సోమల ప్రకాష్, టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్, జనసేన మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ సైనికుడు ఆలం అలీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ముదిగుబ్బలో కొవ్వొత్తుల ర్యాలీ

పాపం.. లేగదూడ..!





వాహనాల్లో తరలిస్తున్న లేగదూడ, పశువులు

పుట్టి రోజులే అయింది..
ముదురు వర్ణ దేహం..
తెల్లటి మూతి..
నుదుటిపై విశాలమైన తెల్ల చార..
కాళ్లపైనా తెల్లటి చారలు..
అంబా అని అరిచే
లేత గొంతుక..
కుప్పిగంతులు వేసే
లేగతనం..
ముద్దులొలికే నీ రూపం..
అబ్బో.. పొగడతరమా..!

ఇవేవీ..
కర్కశ మనుష్యులను
కదిలించలేవు..
నీ ఒంట్లోని నెత్తురు రుచిమరిగిన
వారిని కరిగించలేవు..
నీ మాంసాన్ని ఆశించే ఆటవికులను
అదిలించనూలేవు..
నీ బేలచూపులు..
కబేళాలకు తరలకుండా ఆపనూ లేవు..

నీ పసిగొంతును కోసి..
పసి గుండెను చీల్చి..
పసి దేహాన్ని ముక్కలు చేసే..
ఈ పైశాచిక లోకంలో..
నీకు లేదు బతికే హక్కు..
లేదు.. కాపాడే దిక్కు..

గోరంట్ల, జూలై 25: మూగజీవాలను కబేళాలకు తరలిస్తున్నారు. లేగదూడలనూ వదల్లేదు కర్కశులు. స్థానిక మార్కెట్‌యార్డులోని పశువుల సంత నుంచి తమిళనాడులోని కబేళాలకు నాలుగు వాహనాల్లో 16 పశువులు, 35 లేగదూడలను తరలిస్తున్నారు. గోరంట్ల ప్రధాన రహదారిని కాదని అడ్డదారుల్లో తరలిస్తుండగా జనసేన, బీజేపీ నాయకులు గురువారం పట్టుకుని, పోలీసులకు అప్పగించారు. పులేరు, రెడ్డిచెరువు కట్ట మీదుగా కదిరి రహదారిలోకి తరలిసుండగా కొండాపురం క్రాస్ రోడ్డు వద్ద పట్టుకున్నారు. చాలాకాలంగా ఈ అక్రమ రవాణా సాగుతోంది. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విషయం తెలుసుకున్న బీజేపీ, జనసేన నాయకులు దారికాచి పశువుల వాహనాలను పట్టుకున్నారు. చిత్తూరు జిల్లాలోని పలమనేరు, పుంగనూరుకు తీసుకెళ్తున్నట్లు వాహనదారులు బుకాయించగా, 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. గోరంట్ల పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని, నాలుగు వాహనాలతోపాటు పశువులు తరలిస్తున్న వారిని స్టేషన్‌కు తరలించారు. తరలిస్తున్న వాటిలో లేగదూడలు కూడా ఉండడం శోచనీయం. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి సురేష్, బీజేపీ మండల కన్వీనర్ ఈశ్వర్ రెడ్డి, నాయకులు, యువకులు ఉన్నారు.

సేవాలాల్ జయంతి ఉత్సవాలకు రూ.50 లక్షలు మంజూరు చేయండి

సీఎం చంద్రబాబుకు మంత్రి పయ్యావుల కేశవ్ వినతి



అనంతపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గుత్తి మండలం సేవాఘడ్‌లో నిర్వహించే సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలకు రూ. 50 లక్షలు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కోరారు. సాధారణ బడ్జెట్‌లో ఉత్సవాలకు నిధుల కేటాయింపులు చేయాలన్నారు. గురువారం సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబునాయుడును మంత్రి పయ్యావుల కేశవ్ కలిశారు. గుత్తి మండలంలోని సేవాఘడ్‌లో సేవాలాల్ మహరాజ్ జన్మించారన్నారు. ప్రతి ఏడాది ఫిబ్రవరి 13 నుంచి 15వ తేదీ వరకు దేశవ్యాప్తంగా ఆయన జయంతిని జరుపుకుంటున్నారన్నారు. సంత్ సేవాలాల్ మహరాజ్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు, లక్షలాది మంది భక్తులు జన్మదిన వేడుకలకు హాజరై సేవాఘడ్‌లో మాతా జగదాంబ, సేవాలాల్ మహరాజ్‌కి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ జయంతి ఉత్సవాలకు ఎలాంటి నిధులు మంజూరు చేయలేదన్నారు. ఉత్సవాల సమయంలో రవాణా, ఆహారం, వసతి, ఇతర సౌకర్యాల కోసం సంత్ సేవాలాల్ మహరాజ్ చారిటబుల్ ట్రస్టు వివిధ రూపాల్లో రుణాలు తీసుకున్నారన్నారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో ప్రతి ఏటా రూ. 25 లక్షల నిధులు మంజూరు చేసిందన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన సీఎం చంద్రబాబు నాయుడుకు గుర్తు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2025 ఫిబ్రవరిలో నిర్వహించే సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలకు రూ. 50 లక్షలు నిధులు మంజూరు చేయాలని మంత్రి కోరారు.

రైలింజన్ల నిర్వహణలో మొదటిస్థానం: డీఆర్‌ఎం

గుత్తి, జూలై 25: రైలింజన్ల నిర్వహణలో గుత్తి డీజిల్ షెడ్ ఇండియన్ రైల్వేలోనే నెంబర్-1గా ఉందని గుంతకల్లు డీఆర్‌ఎం విజయ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక డీజిల్ షెడ్‌లో ఇండియన్ రైల్వే, వెబ్ టెక్ కంపెనీ ఆధ్వర్యంలో నూతనంగా డీజిల్ షెడ్‌కు వచ్చిన వెబ్‌టెక్ ఇంజన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుత్తి డీజిల్ షెడ్‌లో జీ9 ఎలక్ట్రికల్ లోకోను 90, జీ4 హెచ్‌హెచ్‌పీ ఇంజన్లు 46, జీ4 ఇంజన్లు 14 ప్రస్తుతం ఉన్నాయన్నారు. అందులో భాగంగా వెబ్‌టెక్ కంపెనీకి చెందిన 130 లోకోలు డీజిల్ షెడ్‌కు దశల వారిగా వచ్చాయన్నారు. ఈ లోకోలో కార్మికులు, అధికారుల నైపుణ్యతను ఆయన కొనియాడారు. ఈ కంపెనీ నుంచి 250 డీజిల్ ఇంజన్లను కేటాయించిందన్నారు. ఇప్పటికే దశల వారిగా 130 ఇంజన్లు వచ్చాయన్నారు. గుత్తి డీజిల్ షెడ్ ఇండియన్ రైల్వేలోనే నెంబర్-1గా వచ్చేలా కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన డీజిల్ షెడ్ ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్థానిక డీజిల్ షెడ్ డీఎంఈ ప్రమోద్, వెబ్‌టెక్ కంపెనీ ప్రతినిధులు సందీప్, రజినీస్, గుత్తి, గుంతకల్లు డీజిల్ షెడ్ అధికారులు పాల్గొన్నారు.

పట్టుదల ఉంటే లక్ష్యసాధన సులభమే

కియ సీఏఓ క్యాబ్డాంగ్ లీ



శిక్షణ పూర్తిచేసుకున్న వారితో కియ, సంభవ్ ఫౌండేషన్ సిబ్బంది, ఆర్టీసీ అధికారులు

అనంతపురం కల్చరల్, జూలై 25: పట్టుదల, ఏకాగ్రత ఉంటే అనుకున్న లక్ష్యాలను సాధించడం సులభమేనని కియ సీఏఓ క్యాబ్డాంగ్ లీ పేర్కొన్నారు. సంభవ్ ఫౌండేషన్ సహకారంతో కియ కంపెనీ ఆధ్వర్యంలో 112 మంది ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో ఉచిత డ్రైవింగ్ శిక్షణను బుధవారం నాటికి పూర్తి చేసుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం అనంతపురం డిపో ఆవరణలో వీరికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. 112 మందిలో 108 మంది హెవీ లైసెన్సును పొందగా వీరందరికీ సంభవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కియతోపాటు వివిధ కంపెనీల్లో నెలకు రూ.20వేల నుంచి రూ.30వేల వేతనంతో కూడిన ఉద్యోగావకాశాలు కల్పించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అనంతపురం ఆర్‌ఎం సుమంత్ ఆర్ ఆదోని, సత్యసాయి జిల్లా డీపీటీఓ మధుసూదన్, అనంతపురం డీఎం నాగభూపాల్, ఎంఎఫ్ నారాయణస్వామి, సీఐ వినయ్‌కుమార్, బస్టాండు మేనేజర్ మూర్తి, కియా లీగల్ అడ్వైజర్ యోంగిల్ మా, మేనేజర్ రవిశంకర్, అసిస్టెంట్ మేనేజర్ వీరేంద్ర, సంభవ్ ఫౌండేషన్ సీఓఓ బాలాజి, సీఎఫ్ఓ రాజ్‌కుమార్, ఏజీఎం గిరిధర్‌రెడ్డి, ఆర్‌ఎం అనీల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

20 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

బొమ్మనహాళ్, జూలై 25: తుంగభద్ర జలాశయానికి గురువారం వరద కొనసాగుతుండడంతో టీబీ బోర్డు అధికారులు 20 క్రస్ట్‌గేట్లు ఎత్తి 45 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. వాటితోపాటు కాలువలకు 23,469 క్యూసెక్కులను వదులుతున్నారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 97,272 క్యూసెక్కులు నీరు తుంగభద్ర జలాశయంలోకి చేరుతున్నాయి. 1633 అడుగులతో 105.788 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న జలాశయంలో సాయంత్రానికి 1632.14 అడుగులతో 102.340 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న జలాశయంలో సాయంత్రానికి 1632.14 అడుగులతో గురువారం సాయంత్రానికి 102.340 టీఎంసీల నీరు నిల్వ ఉంది. హెచ్చెల్సీ బొమ్మనహాళ్ సరిహద్దు 105 వ కి.మీ. వద్ద సాయంత్రానికి 791 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

కణేకల్లు చెరువుకు చేరిన తుంగభద్ర జలాలు

కణేకల్లు: తుంగభద్ర జలాలు బుధవారం అర్ధరాత్రి కణేకల్లు చిక్కణ్ణేశ్వర వడియార్ చెరువుకు చేరాయి. ఈ నెల 22న తుంగభద్ర డ్యాం నుంచి హెచ్చెల్సీ కెనాల్‌కు నీరు విడుదల కాగా ఆంధ్రా సరిహద్దుకు 23వ తేదీన చేరుకున్నాయి. బుధవారం అర్ధరాత్రి 12గంటల సమయంలో కణేకల్లు చెరువుకు చేరిన నీటిని అధికారులు దిగువ వైపునకు మళ్లిస్తున్నారు. డ్యాం నుంచి హెచ్చెల్సీకి 750 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా ఆంధ్ర సరిహద్దు 105 కి.మీ. వద్ద 730 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. తుంగభద్ర జలాలను మొదటి ప్రాధాన్యతగా తాగునీటి కోసం ఉపయోగించనున్నట్లు డీఈ మద్దిలేటి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా హెచ్చెల్సీ నీటిపై ఆధారపడ్డ రాయదుర్గం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, నింబగల్లు, గుంతకల్లుతోపాటు మిగతా తాగునీటి ట్యాంకర్లన్నింటికీ వారంరోజులపాటు నీటిని మళ్లిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా 105 కి.మీ. నుంచి 189 కి.మీ. వరకు హెచ్చెల్సీ కాలువలో నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు డీఈ పేర్కొన్నారు. తుంగభద్ర జలాలు చెరువుకు చేరడంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

చీనీ కాయలు టన్ను రూ.18వేలు

అనంతపురం రూరల్, జూలై 25: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలు, కనిష్ఠంగా రూ.2,500, సరాసరి రూ.12 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1156 టన్నుల చీనీకాయలు వచ్చాయని అన్నారు.

రికార్డుల మార్పుపై రైతుల ధర్నా

పాఠశాల స్థలంతోపాటు 11 ఎకరాలను ఓడీసీ మండల వాసి పేరున మార్చిన వైనం

ఎలా మారుస్తారంటూ రైతుల ఆందోళన



తహసీల్దార్‌తో రైతుల వాగ్వాదం

గోరంట్ల, జూలై 25: తమ అనుభవంలో ఉన్న దాదాపు 11.23 ఎకరాల భూమిని మరో వ్యక్తి పేరున రెవెన్యూ రికార్డుల్లో మార్పు చేయడంపై గుట్టిపల్లికి చెందిన బాధిత రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళనకు దిగారు. గోరంట్ల మండలంలోని గుట్టిపల్లిలో సర్వేనెంబర్ 512-2లోని 1.16ఎకరాల ప్రభుత్వ పాఠశాల స్థలంతో పాటు పలువురు రైతులకు సంబంధించిన మొత్తం 11.23ఎకరాల అనుభవంలో ఉన్న భూమిని ఓడీసీ మండలంలోని కుసుమవారిపల్లికి చెందిన కొండే ఈశ్వర్‌రెడ్డి పేరున వన్‌బీలో ఈనెల 22న అధికారులు మార్పులు చేశారు. విషయం తెలుసుకున్న బాధిత రైతులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ అక్బర్‌బాషాతో తమగోడును వెళ్లబోసుకున్నారు. అక్కడే ఉన్న టీడీపీ నాయకులు బాలక్రిష్ణచౌదరి, నరేష్, రాజారెడ్డి, మల్రెడ్డిపల్లిత నరసింహులు రైతులకు మద్దతు పలికారు. అర్హులైనవారికి వన్‌బీ మార్చడానికి సంవత్సరాలతరబడి తిప్పుకుంటున్నారని, అలాంటిది అతడి పేరుమీద కొన్నిరోజుల వ్యవధిలో ఎలా భూమిని కట్టపెడతారని ప్రశ్నించారు. నెలరోజులక్రితమే పాఠశాల స్థలం మరొకరి పేరున అన్యాక్రాంతమవుతుందన్న సమాచారం ప్రధానోపాధ్యాయులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా ఆ స్థలాన్ని మరొకరికి మార్పు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో వీఆర్‌ఓ, ఆర్‌ఐలతో విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వారికి హామీ ఇచ్చారు. అయితే ఆ సమాధానంతో రైతులు సంతృప్తి చెందలేదు. తహసీల్దార్ చాంబర్ ముందు వరండాలో బైఠాయించి ధర్నా చేశారు. తమకు న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యమని రామిరెడ్డి పెట్రోల్ బాటిల్‌తో నిరసన తెలిపాడు. సీఐ సుబ్బరాయుడు అక్కడికి చేరుకుని రైతులకు సర్ది చెప్పారు. వివాదాస్పద భూమిని రికార్డుల్లో అపరిష్కృత భూమిగా తహసీల్దార్ రెడ్ మార్క్‌లో ఉంచినట్లు ప్రకటించడంతో రైతులు ఆందోళన విరమించారు. ఆందోళనలో నగేష్, మునీంద్ర, వెంకటరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి బయప్పరెడ్డి, రంగారెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఓబులరెడ్డి, తిరుపాల్, లక్ష్మీనారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, రామిరెడ్డి తదితరులున్నారు.

ఫ్యాక్టరీ యాజమాన్యం, రైతుల మధ్య ఘర్షణ

వెనుదిరిగిన పొల్యూషన్ అధికారులు



వాగ్వాదానికి దిగిన ఫ్యాక్టరీ యాజమాన్యం, రైతులు

బొమ్మనహాళ్, జూలై 25: స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ యజమానులు, రైతుల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో పొల్యూషన్ అధికారులు వెనుదిరిగారు. మండల పరిధిలోని నేమకల్లు గ్రామశివారులో ఉన్న స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీల ద్వారా వచ్చే పొల్యూషన్‌తో పంట పొలాలు దెబ్బతింటున్నాయని, పరిహారం సైతం అరకొరగా అందించి చేతులుదులుపుకున్నారని ఆరోపిస్తూ రైతులు, సీపీఐ నాయకులు గతవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ నేపథ్యంలో గురువారం పొల్యూషన్ అధికారులు మహేష్, వెంకటేశు పంట భూములను పరిశీలించేందుకు వచ్చారు. విషయం తెలుసుకున్న బాధిత రైతులు పొలాల వద్దకు వెళ్లారు. వారితో సీపీఐ నాయకులు ఉన్నారు. ఇదే సందర్భంలో అక్కడకు ఫ్యాక్టరీ యాజమాన్యం చేరుకుంది. ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని చూసి మీరెందుకు ఇక్కడకు వచ్చారని సీపీఐ నాయకులు ప్రశ్నించారు. మీకు ఇక్కడ ఏం పని అని ఫ్యాక్టరీ యాజమాన్యం సీపీఐ నాయకులను అడిగారు. తమ తరఫున మాట్లాడేందుకు వచ్చారని రైతులు సమాధానమిచ్చారు. ఈ సందర్భంలో రైతులు, ఫ్యాక్టరీ యాజమాన్యానికి మధ్య వాదులాట జరిగింది. ఇదికాస్త ఘర్షణ వాతావరణానికి దారితీసింది. దీంతో పంట పొలాలను పూర్తిస్థాయిలో పరిశీలించకుండానే పొల్యూషన్ అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం రైతులు మాట్లాడుతూ ఫ్యాక్టరీల నుంచి వచ్చే పొల్యూషన్ ద్వారా పంట పొలాలు దెబ్బతినడమేకాకుండా అనారోగ్యానికి గురవుతున్నామన్నారు. అంతేకాకుండా పరిహారాన్ని సైతం అరకొరగా ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు.

అమిగోస్ ఆగడాలు ఆగవా..?

మైన్స్ కాంట్రాక్టర్ రాజేష్



అమిగోస్ అక్రమాలపై మైన్స్ డీడీకి ఫిర్యాదు చేస్తున్న కాంట్రాక్టర్ రాజేష్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 25: ప్రభుత్వం మారినా జిల్లా సంపదను కొల్లగొడుతున్న అమిగోస్ మినరల్స్ సంస్థ ఆగడాలు ఆగవా అని మైన్స్ కాంట్రాక్టర్ రాజేష్ మండిపడ్డారు. గతంలో అమిగోస్ అక్రమాలపై ఫిర్యాదు చేసినా విచారణ జరపకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని రాజేష్ గురువారం సాయంత్రం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని భూగర్భ గనుల శాఖ డీడీ నాగయ్య ఎదుట నిరసనకు దిగాడు. 2023 డిసెంబరు 7న అమిగోస్ అక్రమాలపై మైన్స్ అధికారులకు ఆధారాలతో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఎటువంటి చర్యలు తీసుకోకపోగా ఆ సంస్థను వెనుకేసుకొస్తుండడంపై ఏంటని ప్రశ్నించారు. ఆత్మకూరు, బుక్కరాయసముద్రం మండలం కేకే అగ్రహారం, రాప్తాడు, పామిడి వంకరాజుకాలవ ప్రాంతాల్లో తాత్కాలిక అనుమతులు తీసుకుని మట్టిని తరలించిన అమిగోస్ కోట్లు కొల్లగొట్టిందని ఆరోపించారు. లీజు కాంట్రాక్టర్లను బెదిరింపులకు గురి చేస్తూ అప్పటి వైసీపీ సీఎం, అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్లు చెప్పుకుని అమిగోస్ సంస్థ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 76 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసుకుని కోట్లాది రూపాయలు దోచుకున్నారన్నారు. వెంటనే అమిగోస్ జిల్లాలో చేసిన అవినీతి, అక్రమాలు, అక్రమ వసూళ్లపై సీఐడీ విచారణ జరిపి తిన్నసొమ్మును కక్కించాలని డిమాండ్ చేశారు. అంతేగాక ప్రభుత్వానికి చెల్లించాల్సిన లీజు బకాయి సుమారు రూ.100కోట్లుని వెంటనే రికవరీ చేయాలన్నారు. అమిగోస్ ఆగడాలను సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తామన్నారు.

నమ్మించి.. రూ.4కోట్లకు టోకరా

చక్కెర వ్యాపారం పేరిట హడావుడి

అధిక వడ్డీ చెల్లిస్తూ.. అప్పులకు వల

వేరుశనగ, బియ్యం, పొట్టేళ్ల కొనుగోలు

స్నేహితుల వద్ద బంగారం తీసుకుని..

రెండు రోజుల క్రితం అదృశ్యం



మహేశ్వర్‌రెడ్డి (ఫైల్)

కదిరి/నల్లచెరువు, జూలై 25: నల్లచెరువు మండల కేంద్రానికి రెండు నెలల క్రితం వచ్చిన ఓ వ్యక్తి.. అద్దె గదిలో ఉంటూ.. అందరినీ నమ్మించి రూ.4 కోట్లకు టోకరా వేశాడు. చక్కెర వ్యాపారంతో ప్రారంభించి.. వేరుశనగ, బియ్యం, పొట్టేళ్లు.. ఇలా వివిధ రకాల వ్యాపారాలు చేస్తున్నట్లు నమ్మించాడు. అతని హంగు, ఆర్భాటం చూసి చాలా మంది అప్పులు ఇచ్చారు. మొదట్లో వారానికి రూ.లక్షకు రూ.5 వేల దాకా వడ్డీ ఇచ్చి.. వల విసిరాడు. దీంతో అత్యాశకుపోయి అతనికి చాలామంది రూ.లక్షలకు లక్షలు అప్పులు ఇచ్చారు. నల్లచెరువుకు రెండు నెలల క్రితం వచ్చిన ఆ వ్యక్తి.. తన పేరు మహేశ్వర్ రెడ్డి అని పరిచయం చేసుకున్నాడు. నల్లచెరువు బస్టాండ్ ప్రాంతంలో ఓ గదిని అద్దెకు తీసుకున్నాడు. ఆ గదికి కార్పొరేట్ హంగులు సమకూర్చుకున్నాడు. మొదట చక్కెర వ్యాపారం మొదలు పెట్టాడు. లారీల కొద్ది చక్కెరను తీసుకువచ్చి మండలకేంద్రంతోపాటు ఇతర ప్రాంతాల్లో విక్రయించాడు. ఆయన వ్యాపార ఆర్భాటం చూసి, స్థానికంగా ఉన్న కొంతమంది చేరువయ్యారు. వారి నుంచి కొంత డబ్బు తీసుకోవడం.. వారం వారం రూ.లక్షకు రూ.5 వేల వడ్డీ చెల్లించాడు. ఇది చూసి మరికొందరు రూ.5 లక్షలు, రూ.10 లక్షలు ఇచ్చారు. ఇద్దరు వ్యాపారుల వద్ద ఆయన 80 బస్తాల బియ్యం తీసుకుని ఇతర ప్రాంతాలకు తరలించాడు. ఒక లారీ లోడు వేరుశనగ కాయలు కొన్నాడు. వివిధ గ్రామల్లో ఆరు వందల పొట్టేళ్ల కొనుగోలు చేశారు. వారంలోపు డబ్బులు చెల్లిస్తానని నమ్మించాడు. తన భార్య శుభకార్యానికి వెళుతోందని చెప్పి.. తనతో స్నేహం చేసిన ఇద్దరి నుంచి రెండు రోజుల క్రితం 20 తులాల బంగారు ఆభరణాలను తీసుకున్నాడు. అంతే..! బుధవారం మాయమైపోయాడు. ఆయన సెల్ ఫోన్ నంబర్లు పనిచేయడం లేదు. దీంతో డబ్బులిచ్చినవారు, లావాదేవీలు నడిపిన వ్యాపారులు కంగారుపడ్డారు. అతని కోసం గురువారం ఉదయం వరకు వివిధరకాలుగా ప్రయత్నించారు. ఆచూకీ లభించకపోవడంతో తాము మోసపోయామని గ్రహించి.. నల్లచెరువు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని డీఎస్పీ శ్రీలత దృష్టికి తీసుకెళ్లారు. మొత్తంగా అతను రూ.4 కోట్ల వరకూ టోకరా వేసినట్లు సమాచారం.

అరుణ్‌కుమార్‌కు ఇన్‌చార్జి డీఈఈ బాధ్యతలు



డీఈఈకి అభినందనలు..

అనంతపురం, సిటీ, జూలై 25: ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలోని ఉరవకొండ (పీఆర్‌ఐ) డివిజన్ ఇన్‌చార్జి డీఈఈగా పనిచేస్తున్న అరుణ్ కుమార్‌కు అదే శాఖ పరిధిలోని అనంతపురం, శింగనమల (పీఆర్‌ఐ) డివిజన్ ఇన్‌చార్జి (అదనపు) బాధ్యతలు అప్పగిస్తూ ఎస్‌ఈ కేవీకేవీ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన గురువారం సాయంత్రం స్థానిక అనంతపురం, శింగనమల డివిజన్ కార్యాలయంలో ఇన్‌చార్జి డీఈఈగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన ఆ శాఖ ఈఈ చంద్రశేఖర్, ఎస్‌ఈ కేవీకేవీ ప్రసాద్‌తో జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇదిలా ఉండగా ఆ శాఖ ఈఎన్‌సీ బాలునాయక్ ఆదేశాలు మేరకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు ఎస్‌ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇదివరకు ఇన్‌చార్జి డీఈఈగా పనిచేస్తున్న శ్రీనివాసమూర్తి యథావిధిగా పీఆర్‌ఐ అనంతపురం ఈఈ పీఏగా విధులు నిర్వహించనున్నారు.

ఎలుగుబంటి దాడిలో ఇద్దరికి గాయాలు

బ్రహ్మసముద్రం, జూలై 25: మండల పరిధిలోని పడమటి కోడిపల్లి గ్రామ సమీపంలో గురువారం ఎలుగుబంటి దాడిలో ఇద్దరికి గాయాలయ్యాయి. మధ్యాహ్నం గ్రామ సమీపంలో కి ఎలుగుబంటి రాగా గ్రామస్థులు తరిమారు. అయితే రవిచంద్ర, గొల్ల తిమ్మయ్యలు ఎలుగుబంటికి ఎదురుపడటంతో వారిపై దాడిచేసింది. వెంటనే వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మండలంలోని పిల్లలపల్లి, గొంచిరెడ్డిపల్లి, రాయలప్పదొడ్డి, బొమ్మగానపల్లిలో ఎలుగుబంట్లు అధికంగా ఉన్నాయని, రాత్రి వేళల్లో పొలాలకు వెళ్లాలంటే భయపడాల్సి వస్తోందని గ్రామస్థులు అంటున్నారు. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుని తమను కాపాడాలని కోరారు.

దరఖాస్తు చేసుకోండి: డీఈఓ

అనంతపురం విద్య, జూలై 25: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు-2024కు ఔత్సాహిక ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవచ్చునని డీఈఓ వరలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయి నేషనల్ ఫౌండేషన్ ఫర్ టీచర్స్ వెల్ఫేర్ ఉత్తమ టీచర్ అవార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. పూర్తి చేసిన రెండు సెట్ల దరఖాస్తులను ఆగస్టు 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా మండల విద్యాశాఖాధికారి లేదా ఉప విద్యాశాఖాధికారికి అందజేయాలన్నారు. ఆయా దరకాస్తులను ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలు పరిశీలించి, రిమార్కులు రాసి అదే నెల 10వతేదీలోగా డీఈఓ ఆఫీస్‌లో అందజేయాలన్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

గుంతకల్లు, జూలై 25: సెంట్రల్ రైల్వేలోని డౌండ్ వద్ద జరుగుతున్న నాన్ ఇంటర్లాకింగ్ పనుల కారణంగా గుంతకల్లు మీదగా వెళ్లే పలు రైళ్లను దారిమళ్లించనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముంబై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (నెం. 11301)ను ఈనెల 29వ తేదీ నుంచి ఆగస్టు 1వ తేదీ వరకూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 11302)ను ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకూ, అలాగే కన్యాకుమారి-పూనా ఎక్స్‌ప్రెస్ (నెం. 16382)ను ఈ నెల 28, 29 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 16381)ని ఈనెల 30, ఆగస్టు 1వ తేదీన పూనే, మీరజ్, కురుద్వాడి స్టేషన్ల మీదుగా మళ్లించనున్నట్లు తెలియజేశారు. ముంబై-నాగర్ కోయిల్ ఎక్స్‌ప్రెస్ (నెం. 16352)ను ఈ నెల 28న, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 16351)ని 29వ తేదీన, చెన్నై సెంట్రల్-ఏక్తా నగర్ ఎక్స్‌ప్రెస్ (నెం. 20919)ను, ట్యుటుకోరిన్-ఓకా ఎక్స్‌ప్రెస్ (నెం. 19567)ను 28న, కరైకల్-ముంబై ఎక్స్‌ప్రెస్ (నెం. 11018)ను 29న, చెన్నై-ముంబై ఎక్స్‌ప్రెస్ (నెం. 22180) ను 30న, ముంబై-కోయంబత్తూరు ఎక్స్‌ప్రెస్ (నెం. 11013) ఈ నెల 30, 31 తేదీల్లోనూ, కోయంబత్తూరు-ముంబై ఎక్స్‌ప్రెస్ (నెం. 11014)ను, నాగర్‌కోయిల్-ముంబై ఎక్స్‌ప్రెస్ (నెం. 16340)ను ఈ నెల 29, నుంచి 31వ తేదీ వరకూ, ముంబై-నాగర్‌కోయిల్ ఎక్స్‌ప్రెస్ (నెం. 16339)ని ఈ నెల 31, ఆగస్టు 1వ తేదీన గుంతకల్లు, బళ్లారి, హుబ్లి, మీరజ్, పూనే స్టేషన్ల మీదుగా మళ్లించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ముంబై-మదురై ఎక్స్‌ప్రెస్ (నెం. 22101)ను ఈ నెల 31న, ముంబై-చెన్నై ఎక్స్‌ప్రెస్ (నెం. 22159) రైలును ఆగస్టు1న పూనా, మీరజ్, కురుద్వాడి స్టేషన్ల మీదుగా మళ్లించనున్నట్లు వివరించారు.

'వసూళ్ల కింగ్'పై ఆరా

అనంతపురం విద్య, జూలై 25: జిల్లా విద్యాశాఖలో ఏళ్ల తరబడి వసూళ్ల కింగ్‌గా మారిన అధికారి ఎవరంటూ విద్యాశాఖలో పలువురు ఆరా తీశారు. కొన్నేళ్లుగా ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ప్రతి ఏటా వసూళ్లకు తెరలేపిన ఓ మండల విద్యాశాఖాధికారి వైఖరిపై ఆంధ్రజ్యోతిలో గురువారం 'వసూళ్ల కింగ్' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనం జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష ఉద్యోగుల్లో చర్చకు దారి తీసింది. ప్రైవేట్ స్కూళ్ల కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆ మండల విద్యాశాఖాధికారి ఎవరంటూ ఆరా తీశారు. ఆయన వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నేతలు, సదరు ఎంఈఓపై విద్యాశాఖ కమిషనర్, ప్రిన్సిపాల్ సెక్రెటరీకి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది.

28న జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు

తాడిపత్రి, జూలై 25: పట్టణంలోని వైఎస్‌ఆర్ మినీ ఫంక్షన్‌హాలులో ఈనెల 28న 5వ జిల్లాస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్న ట్లు ఆర్గనైజర్ సాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 150మంది క్రీడాకారులు సబ్‌జూనియర్, క్యాడట్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పాల్గొంటారన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులు ఆగస్టు 3, 4 తేదీల్లో జరిగే అంతర్ జిల్లాల పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. పోటీలకు ముఖ్యఅతిథిగా టీడీపీ ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి హాజరవుతారన్నారు.

కేంద్ర ప్రభుత్వ అవార్డుకు ఎంపిక



భరత్ | జీవన్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 25: కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న మై గవర్నమెంట్ సాతీ అవార్డుకు జిల్లాకు చెందిన బిసాటి భరత్, జీవన్‌కుమార్ ఎంపికయ్యారు. పదేళ్లుగా కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించిన బిసాటి భరత్ మై గవర్నమెంట్ అంబాసిడర్ అవార్డుకు ఎంపికయ్యారు. అదేవిధంగా యువతలో చైతన్యం కల్పిస్తున్న జీవన్‌కుమార్ మై గవర్నమెంట్ సాతీ అవార్డుకు ఎంపికయ్యారు. ఎంపికైన యువకులకు శుక్రవారం ఢిల్లీలో కేంద్ర ఐటీ శాఖ మంత్రి జితిన్‌ప్రసాద్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. అవార్డు గ్రహీతలకు జిల్లా నెహ్రూ యువకేంద్రం అధికారి మణికంఠ, ప్రోగ్రాం ఇన్‌చార్జి శ్రీనివాసులు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, అర్బన్‌బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్ అభినందనలు తెలిపారు.

వజ్రాల వేటకు వెళ్లి మృత్యువాత

మహానందిలో అనంత మహిళకు పాముకాటు



లక్ష్మీదేవి మృతదేహం

మహానంది, జూలై 25. ఒక్క వజ్రం అయినా దొరకక పోదా? అనే ఆశతో వచ్చిన మహిళ పుల్లా లక్ష్మీదేవి(58) పాముకాటుకు గురై మృతి చెందింది. ఈ సంఘటన గురువారం మహానంది మండలం ఆంజనేయపురంలో జరిగింది. 10 రోజుల క్రితం మండలంలోని సర్వనరసింహస్వామి ఆలయం సమీపంలో ప్రవహించే వాగులో వజ్రల వేట కోసం అనంతపురం పాతూరుకు చెందిన పుల్లా లక్ష్మీదేవితో పాటు మరి కొందరు వచ్చారు. బుధవారం ఆంజనేయపురంలో విడిది చేసే ప్రాంతానికి లక్ష్మీదేవి చేరుకుంది. తన వెంట తెచ్చుకొన్న బ్యాగులోంచి బట్టలు తీసుకొనేందుకు తెరిచే సరికి అప్పటికే బ్యాగులో ఉన్న పాము ఆమెను కాటు వేసింది. ఆమెతో వచ్చిన వారు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక ఆమె మృతి చెందింది. గురువారం కుమారుడు ఆదినారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

సైనికుల త్యాగాలకు విలువ కట్టలేం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి

నగరంలో కార్గిల్ విజయోత్సవ ర్యాలీ



విద్యార్థుల నినాదాలు



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

అనంతపురం సెంట్రల్, జూలై 25: దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెడుతున్న సైనికుల త్యాగాలకు విలువ కట్టలేమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు అన్నారు. బీజేవైఎం ఆధ్వర్యంలో నగరంలో గురువారం కార్గిల్ విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. కృష్ణ కళామందిరం నుంచి సప్తగిరి సర్కిల్ వరకూ కాగడాలు పట్టుకుని ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సందిరెడ్డి మాట్లాడుతూ పాకిస్తాన్ తన దుష్టబుద్ధితో కార్గిల్ కొండ ప్రాంతాలను ఆక్రమించిందని అన్నారు. ఆ ప్రాంతంలో తిష్ట వేసిన ముష్కరులను తరిమివేసేందుకు అప్పటి ప్రధాని వాజ్‌పేయి సైనిక చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. ఆ యుద్ధంలో 550 మంది భారత సైనికులు వీరమరణం పొందారని, వారి త్యాగాలను మరువలేమని అన్నారు. ర్యాలీలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్లు గొంది అశోక్‌కుమార్, చైతన్య కిషోర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాకే శివకుమార్, జిల్లా అధ్యక్షుడు ప్రభుకుమార్, రాష్ట్ర కార్యదర్శి మండల శాంతకుమార్, బీజేవైఎం రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి సూర్యప్రకాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు దుద్దకుంట వెంకటేశ్వరరెడ్డి, జిల్లా మాజీ అంకాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్, జిల్లా ఉపాధ్యక్షుడు మాల్లారెడ్డి, లక్ష్మినారాయణ, లక్ష్మిదేవమ్మ, గోవర్ధన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు అవగాహన

కదిరి, (అమడగూరు), జూలై 25: పరిచయంలేని వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండటం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, చెడు అలవాట్లు తదితర వాటిపై స్థానిక ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో బాలికలకు సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ గురవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శీనా, ఉపాధ్యాయులు, జమేదార్ సుధాకర్, కానిస్టేబుల్ విజయ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లమాడ: మండలంలోని రామాపురం వద్ద ఉన్న అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులకు ఎస్ఐ రమేష్‌బాబు గురువారం అవగాహన కల్పించారు. బాలికలు చెడుప్రవర్తనకు లోనుకాకూడదన్నారు. అలాగే కొత్త వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. గుడ్‌టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, హెడ్ కానిస్టేబుల్ శంకర్‌బాబు పాల్గొన్నారు.

నేటి నుంచి స్పెషల్ డ్రైవ్

నంబులపూలకుంట: మండలంలోని 14 పంచాయతీల్లో శుక్రవారం నుంచి వచ్చే నెల 10 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రాణెమ్మ, ఈఓఆర్‌డీ మనోహర్‌బాబు గురువారం తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి పైపులీకేజీ మరమ్మత్తులు, నీటినిలువ, ఎరువు దిబ్బలు, ట్యాంక్‌లు శుభ్రం చేయడం, చెట్లు పొదలు తొలగించడం పనులు చేపట్టనున్నట్లు చెప్పారు.



నిర్లక్ష్యం వీడరా..!

చెట్టు కొమ్మల్లో విద్యుత్ తీగలు

ఓబుళదేవరచెరువు: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు, విద్యుత్ వైర్లకు పిచ్చి మొక్కలు, తీగలు అల్లుకున్నాయి. అలాగే ఆంజనేయస్వామి ఆలయం వద్ద విద్యుత్ తీగలకు రావిచెట్టు కొమ్మలు, పాత మసీదు వద్ద విద్యుత్ తీగలకు తుమ్మచెట్లు తగులుతున్నాయి. విద్యుత్ వైర్లకు ఇలా చెట్లు, తీగలు తగులుతూ ఉండటంతో వర్షాకాలంలో పెను ప్రమాదం జరిగే అవకాశముందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



చెట్ల మధ్యన ట్రాన్స్‌ఫార్మర్

ఘనంగా సినీ హీరో జన్మదిన వేడుకలు



కొత్తచెరువులో కేక్ కట్ చేస్తున్న అభిమానులు

ధర్మవరం, జూలై 25: సినీ హీరో నారారోహిత్ జన్మదిన వేడుకలను అభిమానులు గురువారం ఘనంగా నిర్వహించారు. అభిమానులు తిరుపాలు, ఎన్‌బీకే హరి, విజయ్, నాగరాజు, పవన్ కేక్‌కట్ చేశారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు.

కొత్తచెరువు: సినీ హీరో నారా రోహిత్ జన్మదినం సందర్భంగా స్థానిక సందీప్ థియేటర్ ఆవరణంలో అభిమానులు, టీడీపీ నాయకులు గురువారం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మీనారాయణ, మార్కెట్‌యార్డ్ మాజీ వైస్ చైర్మన్ రఘుపతి, టీడీపీ నాయకులు కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, ఆస్పత్రి కమిటీ మాజీ చైర్మన్ వేణు, అంబులెన్స్ రమేశ్, సుమలత నాగేంద్ర, రమేశ్, గూడా శీన, సమితి హరి, చంద్ర, రాజేశ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల జలధి



వేపరాలలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

గాండ్లపెంట : మండలంలోని వేపరాలలో జలధి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వారం రోజులపాటు పీర్లను పీర్ల చావిడితో కొలువు తీర్చి ప్రత్యేక అలంకరణతో పూజలు నిర్వహించారు. గురువారం పీర్లను పురవీధుల్లో ఊరేగించారు. అగ్ని గుండంలో యువత కేరింతలతో అలావు తొక్కారు. అనంతరం పీర్లను జలధికి తరలించారు.

రైల్వే అభివృద్ధి కమిటీ సమావేశం



సమావేశంలో చర్చిస్తున్న కమిటీ సభ్యులు

కదిరిఅర్బన్, జూలై 25 : కదిరి రైల్వేస్టేషన్ కార్యాలయంలోకదిరి రైల్వే అభివృద్ధి కమిటీ సమావేశం స్టేషన్ మాస్టార్ క్రిష్ణమూర్తి అధ్యక్షతన గురువారం జరిగింది. కమిటీ సభ్యులు రైల్వే స్టేషన్‌లో నెలకున్న సమస్యలు ఆయనకు వివరించారు. ముఖ్యంగా స్టేషన్‌లో రైళ్లను ఒక నిమిషం మాత్రమే ఆపుతున్నారని, దీంతో ప్రయాణీకుల ఇబ్బందులు పడుతున్నారని, కనీసం ఐదు నిమిషాలపాటు రైలు ఆపాలని కోరారు. ప్రయాణీకుల విశ్రాంతి గదిలో సౌకర్యాలు కల్పించాలని, దివ్యాంగులకు వీల్ చైర్లు ఏర్పాటు చేయాలని అన్నారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కమిటీ సభ్యులు తెలిపిన విషయాలను పరిశీలిస్తామని, ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని స్టేషన్ మాస్టార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు డీఎల్ ఆంజనేయులు, నాగార్జున, మహమ్మద్, తిమ్మరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

తాడిమర్రి, జూలై 25: మండలంలోని రామాపురం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ నాగాస్వామి గురువారం తెలిపారు. గురువారం సాయంత్రం రామాపురం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో తాను సిబ్బందితో వెళ్లి పేకాట శిబిరంపై దాడులు చేశామన్నారు. ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.10,800 నగదుతోపాటు ఆరు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు.

పరిహారం కోసం వినతి

తాడిమర్రి, జూలై 25: స్థానిక ప్రధాన రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు, స్థలాలను పోగొట్టుకున్న బాధితులు తమకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. రోడ్డు విస్తరణ ఎంత చేయాలి.... ఒక్కో బాధితుడు ఎంత మేర నష్టపోతున్నారనే సమాచారం కూడా రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులు అంచనా వేయలేదన్నారు. ఈ విషయంపై కోర్టుకు వెళ్లి తాము స్టే తెచ్చుకున్నా... అధికారులు దగ్గరుండి తమ ఇళ్లను కొట్టివేయించడం దారుణమని వాపోయారు. తమకు పరిహారం అందించి న్యాయం చేయాలని వారు జేసీని కోరారు. జేసీ మాట్లాడుతూ... వ్యవహార విషయం కోర్టులో నడుస్తోందని.. కోర్టు నిర్ణయం తరువాతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. జేసీని కలిసిన వారిలో టీఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు హర్ష, భాస్కర్‌గౌడ్, మండల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడ గంగాధర్‌గుప్తా, ఇస్మాయిల్, లక్ష్మీనారాయణ, హోటల్ చంద్ర, ప్రసాద్ ఉన్నారు.

భూములను రక్షించండి

తాడిమర్రి, జూలై 25: తాడిమర్రి మండలంలో ఆక్రమణలో ఉన్న భూములను స్వాధీనం చేసుకొని.. రక్షించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు బీజేపీ నాయకుడు గోపాల్‌రెడ్డి విన్నవించారు. గురువారం తాడిమర్రిలో పర్యటించిన జేసీని ఆయన కలిసి వినతి పత్రం అందజేశారు. తాడిమర్రిలో 491 సర్వే నెంబరులో వైసీపీ నేత ఆక్రమణలో ఉన్న భూమిని స్వాధీనం చేసుకొని... పేదలకు పట్టాలు ఇప్పించాలని కోరారు. ఆయన వెంట బీజేపీ నాయకులు సురేశ్‌రెడ్డి, బిల్లే చంద్రమోహన్, శీనయ్య, ఆదినారాయణ ఉన్నారు.

పాఠశాల తనిఖీ

కదిరిఅర్బన్, జూలై 25: స్థానిక మున్సిపల్ ఉర్దూ మెయిన్ పాఠశా లను డీఈఓ మీనాక్షి గురువారం తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డు లను పరిశీలించారు. మధ్యాహ్నం పరిశీలించారు. వంటను పాఠశా లలోనే చేయాలని ఏజెన్సీ నిర్వాహ కులకు ఆదేశించారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల పోస్టు ఖాళీగా ఉండడంతో, ఇన్‌చార్జిగా కుటాగుళ్ల మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్‌ను నియమించారు. ఆమె వెంట ఎంఈఓ చెన్నక్రిష్ణ ఉన్నారు.

పనిచేయని ఆధార్ కేంద్రం

గాండ్లపెంట, జూలై 25: మండలంలోని కటారుపల్లిలో సాంకేతిక లోపాలతో ఆధార్ కేంద్రం పనిచేయలేదని ఎంపీడీఓ రామానాయక్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. 5 సంవత్సరాలలోపు పిల్లలకు అంగన్‌వాడీ ఆధ్వర్యంలో ఆధార్ నమోదు చేయించాలన్నారు. కటారుపల్లిలో దాదాపు 12 అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులున్నారని, సాంకేతిక లోపాలవల్ల ఆధార్ కేంద్రం పనిచేయలేదని అన్నారు ఆగస్టులో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు.

నిజాయితీ చాటుకున్న యువకుడు



ఆజాద్‌కు సెల్‌ఫోన్ అందిస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించి ఓ యువకుడు నిజాయితీ చాటుకున్నాడు. ముదిగుబ్బలోని అంబేడ్కర్ సర్కిల్లో ఆజాద్ తన సెల్‌ఫోన్ పోగుట్టుకున్నాడు. అటువైపు వెళుతున్న ఎస్సీ కాలనీకి చెందిన గోపీనాథ్‌కు ఆ సెల్‌ఫోన్ దొరికింది. వెంటనే స్థానిక అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌కి వెళ్లి పోలీసులకు సెల్‌ఫోన్ అప్పగించి యువకుడు నిజాయితీ చాటుకున్నాడు. అనంతరం పోలీసులు ఆ సెల్‌ఫోన్ యజమాని ఆజాద్‌ను పిలిపించి అతనికి సెల్‌ఫోన్‌ను అందించారు. నిజాయితీ చాటుకున్న గోపీనాథ్‌ను సీఐ యతీంద్ర, జమీదార్ ఇస్మాయిల్ అభినందించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన అధికారి

ధర్మవరం రూరల్: మామిడిసాగులో యాజమాన్య పద్ధతులు పాటించి సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు వస్తాయని జిల్లా ఉద్యానవన అధికారి చంద్రశేఖర్ తెలిపారు. గురువారం మండలంలోని ఏలుకుంట్ల గ్రామంలో మామిడిరైతు వెంకటరమణ తోటలో ఏలుకుంట్ల, బుద్దారెడ్డిపల్లి, నేలకోట, బిల్వంపల్లి గ్రామాల రైతులకు మామిడిసాగులో మెళకువలు, కొమ్మకత్తిరింపులు, ఎదుగుదల, యాజమాన్య పద్ధతులు తదితరవాటిపై అవగాహన కల్పించారు. ఎరువుల యాజమాన్యంలో భాగంగా సూపర్‌ఫాస్ఫేట్ రెండుకేజీలు, పొటాష్ ఒకటిన్నర కేజీ, యూరియా అరకేజీ, కార్బోఫెరాన్‌గుళికలు, పశువుల ఎరువుతో కలిపి ప్రతిచెట్టుకు వేయాలన్నారు. తరువాత 15 రోజులకు జింక్ సల్ఫేట్ 250గ్రాములు, మెగ్నీషియం సల్ఫేట్ 250గ్రాములు, బోరాక్స్ 250గ్రాములు, కాపర్‌సల్ఫేట్ 100గ్రాములు, కాండం నుంచి 5అడుగుల దూరంలో గాడి తీసి వేయాలన్నారు. అదేవిధంగా వేరుకుళ్లుకు పాస్ఫోబ్యాక్టీరియా 1కేజీ, ట్రైకోడెర్మవిరిడి 1కేజీ ఎరువుతో కలిపి వాడడం వల్ల వేరుకుళ్లను నివారించుకోవచ్చున్నారు. బంక కంట్రోల్‌కు 5లీటర్ల నీటికి ఒక కేజీ మైలుతిత్తు, 5లీటర్ల నీటికి బట్టీసున్నం కాండానికి పూయాలని సూచించారు. కార్యక్రమంలో ధర్మవరం ఉద్యానవన అధికారిణి అమరేశ్వరి, వీహెచ్ఏలు గీతాంజలి, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

ముంపు భూములకు పరిహారం ఇప్పించండి

నంబులపూలకుంట, జూలై 25: అన్నమయ్య జిల్లా వెలిగి ప్రాజెక్టు రిజర్వాయర్ నీటి నిలువతో మాభూములు ముంపునకు గురవుతున్నాయని, పరిహారం ఇప్పించాలని మండలంలోని అల్లుగుంటివారిపల్లి చెందిన రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ నరేంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేసిన వారు మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మించి దాదాపు 20 సంవత్సరాలు పూర్తి అయిందని, తమ గ్రామానికి చెందిన 20 ఎకరాల భూములు నీటిలో మునిగిపోతున్నాయని, సాగు చేసిన పంటలు నీటిలో మునిగిపోయి నష్టపోతున్నామని వాపోయారు. ఎఫ్ఆర్ఎస్ 420 కొలతగా తీసుకుని భూములను పరిశీలించాలని కోరారు. వెంటనే తమ వద్ద సర్వేర్లను పంపుతామని, కొలతలు వేయించుకోవాలని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో మల్లప్ప నాయుడు, మల్లికార్జున నాయుడు, శ్రీహరి, శ్రీరాములు, శివరామప్ప, సుబ్బయ్య, ఇరిగేషన్ డీఈ శిరీష్‌కుమార్, ఏఈ గంగాధర్ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

రికార్డు రూమ్‌ల వద్ద వీఆర్ఏను నియమించాలి



బత్తలపల్లిలో రికార్డులను పరిశీలిస్తున్న జేసీ



తాడిమర్రిలో నూతన తహసీల్దార్ భవనాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్, జూలై 25: ప్రభుత్వ కార్యాలయాల్లో ఉండే రెవెన్యూ రికార్డులను భద్రపరుచుకోవాలని, ప్రతి రోజు ఒక వీఆర్ఏను రికార్డు రూమ్ వద్ద నియమించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. ధర్మవరం తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డు రూమ్‌ను పరిశీలించి భద్రతపై అధికారులతో చర్చించారు. రైతుల భూములకు సంబంధించిన రికార్డులు కార్యాలయంలో ఉంటాయని, వాటిని భద్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న భూసమస్యలను సత్వరమే పరిష్కారించాలని సూచించారు. కోర్టు కేసులు, వ్యవసాయ భూములు విషయం, సర్వే, భూతగదాల విషయాలపై ప్రత్యేక దృష్టి సారించి విధులను బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. ఆయన వెంట ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, తహసీల్దార్ రమేష్, రెవెన్యూ అధికారులు లక్ష్మీదేవి, వీఆర్ఓలు, సిబ్బంది ఉన్నారు.

బత్తలపల్లి: తహసీల్దార్ కార్యాలయాల్లో రెవెన్యూ రికార్డులకు భద్రత కల్పించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. బత్తలపల్లి తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డులను ఆయన గురువారం తనిఖీ చేశారు. కార్యాలయంలో సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. రెవెన్యూ రికార్డుల గురించి వీఆర్వోల వద్ద ఆరాతీశారు. ఏప గ్రామంలో ఏప సంవత్సరం వరకు అడంగల్ ఉన్నాయని, రీ సెటిల్‌మెంట్ రికార్డుల గురించి అడిగి తెలుసుకున్నారు. హైకోర్టులో రీ పిటీషన్‌లు ఏవైనా పెండింగ్‌లో ఉన్నాయా.. వాటికి కౌంటర్ వేశారా.. ఏ స్టేజ్‌లో ఉన్నాయి.. అని విచారించారు. ఆయన వెంట ధర్మవరం ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి ఉన్నారు.

తాడిమర్రి: రెవెన్యూ రికార్డులను పక్కాగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ స్థానిక అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం తాడిమర్రి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. గడిచిన మూడేళ్లలో జరిగిన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ, మ్యూటేషన్లపై ఆరాతీశారు. మ్యూటేషన్‌కు సంబంధించిన రికార్డులను పక్కాగా భద్రపరచాలని తహసీల్దార్ నజియాబానును ఆదేశించారు. దేవాలయాలకు దాతలు ఇచ్చిన భూముల్లో కబ్జాదారులు పాగా వేస్తున్నట్టుగా తమ దృష్టికి వచ్చిందని, వాటిని ఎక్కడెక్కడ పరిష్కరించాలని తెలిపారు. నిర్మాణం దాదాపు పూర్తయి ఐదేళ్లుగా ప్రారంభానికి నోచుకోని తహసీల్దార్ భవనాన్ని ధర్మవరం ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డితో కలిసి జేసీ పరిశీలించారు. ఎందుకు కార్యాలయాన్ని ప్రారంభించలేదని జేసీ తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీఓ మణిమంజరీ, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

వీఆర్ఏలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

నల్లమాడ, జూలై 25: అర్హులందరికీ ఉద్యోగోన్నతులు కల్పించాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని వీఆర్ఏలు తహసీల్దార్ నాగభూషణకు గురువారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ... ఇటీవల అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులు అగ్నికి ఆహుతయ్యా యన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం రెవెన్యూ కార్యాలయాల వద్ద రాత్రి సమయంలో కాపాలాదారులుగా వీఆర్ఏలు పనిచేయాలని సీసీఎల్ఏ నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. కొన్ని జిల్లాలో వీఆర్ఏలకు ఉద్యోగోన్న తులు కల్పించారని తెలిపారు. తహసీల్దార్ వాహనాలకు డ్రైవర్లుగాను, అటెండర్లగాను నియమించారని, వారిలాగే తమలో అర్హులైనవారికి ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, మండలాధ్యక్షులు నరసింహులు, హైదర్‌వలీ, వీఆర్ఓలు బాబు, మురళి, జిలాన్‌బాషా, నారాయణమ్మ, నాగప్ప, రామాంజనేయులు, సతీష్ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్ఏలు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ధర్మవరం, జూలై 25: ప్రతిఒక్కరు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియా సాల్మాన్ పేర్కొన్నారు. స్థానిక ఎన్జీఓ హోం కార్యాలయంలో గురువారం ధర్మవరం సబ్‌డివిజన్ మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విషజ్వరాల బారిన పడకుండా ప్రజలకు గ్రామీణ ప్రాంతాల్లో ఏఎన్ఎంలు అవగాహన కల్పించాలన్నారు. మురుగుకాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చేయించడం, దోమలు రాకుండా ఫాగింగ్ చేయించడం తదితర పనులు చేయించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారులు, మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరాంనాయక్, బీజేపీ నాయకులు హరీశ్, మల్లికార్జున పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియా సాల్మన్

స్పెయిన్ క్రీడాకారుల శిక్షణ

కొత్తచెరువు, జూలై 25: పరిగి మండలంలోని కొడిగెనహళ్లి గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు స్పెయిన్ దేశానికి చెందిన బాస్కెట్‌బాల్ అంతర్జాతీయ టీం సభ్యులు శిక్షణ ఇస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ మురళీధర్ బాబు తెలిపారు. ఆర్డీటీ సహకారంతో ఈ శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బాస్కెట్ బాల్ కో-ఆర్డినేటర్ కిశోర్‌కుమార్, బాస్కెట్ బాల్ అంతర్జాయ క్రీడాకారులు నటాలియా, వెర్డ్, రీకి ఫోసల్బా, క్రిస్టినా గార్సియా, ఆల్బర్ట్ పెరల్నా, నౌసికా ముసాచ్, ఎన్రిక్ కామాచో, ఆంటోనియా కామాచో, క్లారా పుయిగ్ పాల్గొన్నారు.



బాస్కెట్‌బాల్ శిక్షణ ఇస్తున్న స్పెయిన్ క్రీడాకారులు

ఆర్ఎంపీ క్లినిక్‌ల తనిఖీ



ప్రథమ చికిత్స కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సునీల్

కొత్తచెరువు, జూలై 25: మండల కేంద్రంలో ఆర్ఎంపీలు నిర్వహిస్తున్న చికిత్సా కేంద్రాలను డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సునీల్ గురువారం తనిఖీ చేశారు. సర్టిఫికెట్‌లు రెన్యువల్ చేసుకున్నారా లేదా అసలు సర్టిఫికెట్‌లు ఉన్నాయా లేదా అని ఆరా తీశారు. ఇద్దరు అనుమతి లేకుండానే చికిత్సా కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఆయన వెంట డాక్టర్ జ్యోత్స్న, సీహెచ్ఓ నగేశ్, సీహెచ్ఎన్ రాములమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు లింగారామ్మోహన్, శాంతి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఉన్నారు.

మైకుల మోతను అరికట్టండి



సీఐకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ముదిగుబ్బ, జూలై 25: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించే వారపు సంతలో రోడ్డుకు ఇరువైపులా ఆటోలు, తోపుడు బండ్లపై వ్యాపారం చేస్తున్న వారు మైకుల మోతతో వాహనదారులు, ప్రజలకు చాలా ఇబ్బందులు కలిగిస్తున్నారని, ఆ మైకుల మోతను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు గురువారం సీఐ యతీంద్రకు వినతి పత్రం ఇచ్చిన వారు మాట్లాడారు. మైకుల శబ్దం ఎక్కువగా రావడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. వారపు సంత రోజు, మామూలు రోజుల్లో రోడ్డుకు అడ్డంగా ఆటోలు పెట్టి వ్యాపారం చేసేవారి నుంచి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆటోపెద్దన్న, సీఐటీయూ మండల కార్యదర్శి బండల వెంకటేష్, రంగనాయకులు, బాబు పాల్గొన్నారు.

ధర్మవరంలోనే లేబర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ధర్మవరం, జూలై 25: ధర్మవరంలోనే లేబర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కోకన్వీనర్ అయూబ్‌ఖాన్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ... గతంలో ధర్మవరంలోనే లేబర్ ఆఫీసు, లేబర్ కోర్టు ఉండేదని, కానీ సత్యసాయి జిల్లాగా ఏర్పాటైన తరువాత ధర్మవరంలో ఉన్న లేబర్ ఆఫీసును కొత్తచెరువుకు తరలించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకుడు రఫీ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



ముంతాజ్‌బేగం (ఫైల్)

ధర్మవరం, జూలై 25 : పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురానికి చెందిన ముంతాజ్‌బేగం(48) ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై గురువారం సాయంత్రం మరణించింది. బాతురూంలో స్నానం చేయడానికి వెళ్లిన ఆమె హీటర్ ఆన్ చేసి ఉన్న బకెట్‌ను తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మరణించింది. ప్రమాదస్థలాన్ని పరిశీలించిన వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ముంతాజ్ బేగంకు భర్త అస్లాంబాషా, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు.

రోడ్డు ఆక్రమణల తొలగింపు

కొత్తచెరువు, జూలై 25: స్థానిక జూనియర్ కళాశాల సమీపంలోని పంచాయతీ రోడ్లపై అక్రమంగా నిర్మించిన కట్టడాలను పంచాయతీ అధికారులు గురువారం జేసీబీతో తొలగించారు. ముందుగా పంచాయతీ రోడ్డుకు ఇరువైపుల మూడు అడుగుల చొప్పున ఉన్న నిర్మాణాలను తొలగించారు. అనంతరం ఎవరైనా పంచాయతీ రోడ్లపై, ప్రభుత్వ ఖాళీ స్థలాలలో నిర్మాణాలు చేపడితే పంచాయతీ యాక్ట్ ప్రకారం తొలగిస్తామని పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శి సురేంద్రరెడ్డి తెలిపారు. అక్రమ కట్టడాలపై ఫిర్యాదు చేస్తే వాటిని సైతం తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి అజయ్, వీఆర్వో భార్గవ్ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షిర్డీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో బాబా

హిందూపురం అర్బన్, జూలై 25: పట్టణ పరిధిలోని నానెప్పనగర్‌లో వెలసిన షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం బాబా వెండి సంహాసనం, వెండి కిరీటంతో భక్తులకు ధర్శనమిచ్చారు. తెల్లవారు జామున వివిధ అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ప్రాకారోత్సవం నిర్వహించి భజనలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో బాబాను దర్శించుకున్నారు.

మడకశిరలో మోస్తరు వర్షం

మడకశిరటౌన్, జూలై 25: నియోజకవర్గ వ్యాప్తంగా వారం రోజుల నుంచి మేఘాలు కమ్ముకొని ఉండటంతో పాటు రోజూ చిరు జల్లులు ఓ మోస్తారు వర్షం కురుస్తోంది. బుధవారం రాత్రి కూడా వర్షాలు కురిశాయి. మడకశిరలో 6.2 మిల్లీమీటర్లు, అమరాపురం మండలంలో 1.6 మి.మీ., గుడిబండ 4.0 మి.మీ., రొళ్ల 6.4 మి.మీ., అగళి 4.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. రోజూ గంట, అరగంటకు ఒకసారి చిరు జల్లులు పడుతుండటంతో చాలా మంది ఇళ్లకే పరిమితమవుతున్నారు.

స్పాట్ అడ్మిషన్లు

మడకశిర రూరల్, జూలై 25: మండలంలోని గుండుమలలో ఉన్న ప్రభుత్వ పాటిటిక్నిక్ కళాశాలలో చేరాలనుకునే విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలేటి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు దరఖాస్తుకు పదో తరగతి పాసైన మార్కులిస్టు, టీసీ, స్టడీ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రాలు జతపరచాలని తెలిపారు. ఓసీ, బీసీ రూ.5800. ఎస్టీ, ఎస్సీలు రూ.5050 రుసుము చెల్లించాలని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం సెల్ ఫోన్ నెంబర్స్‌కు సంప్రదించాలన్నారు. 9866631405. 9182040709

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి : ఏపీఓ

గుడిబండ, జూలై 25: ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ భార్గవి కూలీలకు సూచించారు. మండలంలోని తాడికెర, కరెకెర, పంచాయతీ గ్రామాల్లో ఉపాధి కూలీలతో ఆమె గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ ఉపాధిహామీ పనులకు కూలీలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఉపాధిహామీ పథకం కూలీలకు వరం లాంటిదన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్‌లు వెంకటేశ్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

హిందూపురం, జూలై 25: పట్టణంలోని రైల్వే రోడ్డులో పులేకమ్మ ఆలయం సమీపంలో నరసింహ (21)అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. పులేకమ్మ ఆలయం సమీపంలో నివాసమున్నవారు గురువారం ఉదయం ఖాళీ ప్రదేశంలో చెట్లమధ్యలో మృతదేహం పడి ఉండగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ కంజక్షన్, సీఐ శ్రీనివాసులు, సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన యువకుడు తండ్రి గంగాధరప్ప కొంతకాలం క్రితం పెనుకొండ మండలం నుంచి హిందూపురం చౌడేశ్వరీకాలనీకి వచ్చి ఉంటున్నాడు. మృతిచెందిన యువకుడు కాగితాలు ఏరి గుజిరికి వేసి జీవనం సాగించేవాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి

గోరంట్ల, జూలై 25: మండలంలోని కొండాపురం పంచాయతీ రాగిమేకమల పల్లి వద్ద పులేరుకు వెళ్లే రహదారిలో గుర్తుతెలియన వాహనం ఢీకొని కృష్ణజింక గురువారం మృతిచెందింది. గుర్తుతెలియన వాహనం ఢీకొనడంతో రోడ్డు పక్కన పడి ఉన్న జింకను స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న రాగిమేకలపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు దానిని పాఠశాల వద్దకు తరలించి, అటవీశాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖాధికారి అక్కడికి చేరుకుని పరిశీలించారు. పొట్టపై తగిలిన తీవ్ర గాయం వలన జింక మృతి చెందినట్లు గుర్తించారు. అనంతరం పశువైద్యశాలకు తరలించి, పోస్టుమార్టం అనంతరం జింక కళేబరాన్ని దహనం చేసినట్లు అటవీశాఖాధికారి రామక్రిష్ణ తెలిపారు. దాని వయస్సు ఏడాది ఉంటుందని తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న స్కూటీ

మడకశిర రూరల్, జూలై 25: మండలంలోని బుళ్ళసముద్రం గ్రాసమీపాన రోడ్డు పక్కనఆగిన ఉన్న లారీని గురువారం రాత్రి స్కూటీ ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. హిందూపురం నుంచి మడకశిర వైపు వస్తున్న లారీ బుళ్ళసముద్రం వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉన్నారు. అదే సమయంలో మడకశిర నుంచి హిందూపురం వెళుతున్న స్కూటీ వాహనదారుడు లారీని ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిని అతడిని 108 వాహనంలో హిందూపురం ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చెరుకున్న పోలీసులు గాయపడిన వ్యక్తి హిందూపురం పట్టణానికి చెందినవాడిగా గుర్తించారు. సంఘటనకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



పావగడ, జూలై 25: గుర్తుతెలియని 55ఏళ్ల వృద్ధుడు పట్టణంలోని బాపూజీ పాఠశాల వద్ద మృతిచెందినట్లు పోలీసులుతెలిపారు. బుధవారం రాత్రి గాలి, వాన చలికి వణుకుతూ మృతి చెందినట్లుగా పోలీసులు గుర్తించారని, అతడి ఆచూకీ తెలిస్తే పావగడ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని సీఐ సురేష్ తెలిపారు.

స్థానికులే వీఆర్‌ఓలు

● వైసీపీ ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున అక్రమాలు

● ప్రజల నుంచి వెల్లువెత్తుతున్న ఆరోపణలు

గుడిబండ, జూలై 25: మండలంలోని వీఆర్‌ఓలుగా చాలా మంది స్థానికులే విధులు నిర్వహి స్తుండటంతో వారు గ్రామాల్లో పెత్తనం చెలాయిస్తు న్నారని ప్రజల నుంచి పెద్దఎత్తున విమర్శలు వెల్లువె త్తుతున్నాయి. వీఆర్‌ఓలు సొంత మండలాల్లో విధు లు నిర్వహించకూడదని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా... నిబంధనలను తుంగలో తొక్కి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఓ ప్రజాప్రతినిధిని కలిసి సొంత మండలంలోనే పోస్టింగ్‌లు తెచ్చుకున్నారని, వారు పలు అవినీతి అక్రమాలకు పాల్పడి రికార్డులను తారు మా రు చేసినట్లు పెద్దఎత్తున ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీఆర్‌ఓలు ఆయా గ్రామ పంచాయతీ నాయకులతో కుమ్మక్కై అవినీతి అక్ర మాలకు పాల్పడి జేబులు నింపుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంటి పట్టాలు, పట్టాదారు పాసుపుస్తకాలు, మ్యుటేషన్, విద్యుత్ సర్వీసుల కోసం సర్టి ఫికెట్లు, వాల్టా చట్టం సర్టిఫికెట్, అసైన్డ్ భూములకు పట్టాదారు పాసుపుస్తకాల మార్పు తదితర అక్రమాలకు పెద్దఎత్తున పాల్పడినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. రైతుల నుంచి ఒక్కో పట్టాదారు పాసుపుస్తకం కోసం రైతుల నుండి రూ.5వేల నుంచి రూ.10వేల దాకా వసూలు చేసినట్లు సమాచారం.



గుడిబండ తహసీల్దార్ కార్యాలయం

చాలామంది స్థానికులే విధుల్లో...

గుడిబండ మండలానికి చెందిన వారే చాలామంది ఇదే మండలంలో వీఆర్ ఓలుగా పనిచేస్తున్నారు. జమ్ములబండ గ్రామానికి చెందిన రాజు వైసీపీ ప్రభుత్వ హయాంలో 2019లో వీఆర్‌ఓగా ఉద్యోగం పొంది, ఇదే మండలం చిగతుర్పి, కేఎన్ పల్లి వీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్నారు. చిగతుర్పి గ్రామానికి చెందిన నేత్రా వతి 2019లో వీఆర్‌ఓగా ఉద్యోగం సాధించి మోరుబాగల్-2 వీఆర్‌ఓగా పనిచేస్తున్నా రు. అలాగే జమ్ములబండ గ్రామానికి చెందిన సాయిసంధ్య 2019లో వీఆర్‌ఓగా ఉద్యోగం సాధించి రాళ్లపల్లి-2 వీఆర్‌ఓ. దీపరాణి 2012లో గుడిబండ వీఆర్‌ఏగా చేరారు. ఆమె 2020లో ఉద్యోగోన్నతి పొంది ముదుకూరు-2 వీఆర్‌ఓగా విధులు ని ర్వహిస్తున్నారు. కరికెరకు చెందిన రాధామణి 2012లో వీఆర్‌ఏగా విధుల్లో చేరి 2020లో ఉద్యోగోన్నతి పొంది, అత్తగారి ఊరైన జమ్ములబండ గ్రామంలోనే విధులు నిర్వహిస్తున్నారు. కొంకల్లుకు చెందిన తిప్పేస్వామి వీఆర్‌ఏగా పనిచేస్తూ 2020లో ఉద్యోగోన్నతి పొంది మందలపల్లి వీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్నారు. వీఆర్‌ఓ త్యాగరాజస్వామి ఇరవై ఏళ్ల క్రితం అమరాపురం మండలంనుంచి కరికెర వీఆర్‌ఓగా చేరి మండలంలోని ఎక్కువకాలంగా కొనసాగుతున్నారు. గుడిబండ మండలంలోని శంకరగల్లు గ్రామానికి చెందిన శివమ్మ గుడిబండ వీఆర్‌ఓగా పనిచేస్తున్నారు. ఆమె గ తంలో మోరుబాగల్, చిగతుర్పి, కేఎన్‌పల్లి వీఆర్‌ఓగా పని చేశారు. రొళ్ల మండలంలోని ఓ ప్రజాప్రతినిధిని ఆశ్రయించి గుడిబండకు పో స్టింగ్ తెచ్చుకున్నారు. రొళ్లకు చెందిన నర సింహ మూర్తి జీ.మోరుబాగల్ వీఆర్‌ఓగా వి.ధులు నిర్వహిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడికి అనుకూలంగా పనిచేసినట్లు పెద్దఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. రొద్దం మండలానికి చెందిన రామాంజినేయు లు మడకశిర మండలంలో వీఆర్‌ఓగా పని చేస్తూ 2022లో రాళ్లపల్లి వీఆర్‌ఓగా వచ్చారు.

పెద్దఎత్తున అక్రమాలు

సొంత మండలానికి చెందినవారు వీఆర్‌ఓలుగా ఉద్యోగం నిర్వహిస్తుండటంతో... వారు వైసీపీ నాయకులతో కుమ్మక్కై పలు అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో పనిచేస్తున్న వీఆర్‌ఓలు రైతుల నుంచి పట్టాదారుపాసుపుస్తకం, 1బి, ఇంటిపట్టాలు తదితర పనుల కోసం పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని గత మండల సర్వసభ్య సమావేశంలో మందలపల్లి సర్పంచు ఆరోపించారు. అయితే ఈ విషయంపై ఓ ప్రజాప్రతినిధి ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి, దాన్ని పట్టించుకోవద్దని చెప్పినట్లు సమాచారం. మండలాని కి చెందిన రాజు గత యేడాదిరెవెన్యూ కార్యాలయంలో కంప్యూ టర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహించేవాడు. అప్పట్లో పలువురు రైతులు ఆయనపై అప్పటి సబ్ కలెక్టర్ కార్తీక్‌కు ఫిర్యాదులు చేశారు. సబ్ కలెక్టర్ స్పందించి రాజును కంప్యూటర్ ఆపరేటర్ విధుల నుంచి తొలగించి ఎన్నికల విధులు నిర్వహించే రామలింగప్పకు అప్పగించారు. ఎనిమిదినెలల క్రితం పనిచేసిన తహసీల్దార్‌తో వీఆర్‌ఓలు కుమ్మక్కై రెవెన్యూ రికార్డులు తారుమారు చేసినట్లు రైతుల నుంచి బలంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత వైసీపీ హయాంలో జరిగిన పట్టాదారు పాసుపుస్తకాలు, ఇంటిప ట్టాలు, 1బి, అసైన్డ్ భూముల తారుమారు తదితరవాటిపై విచారణ చేసి బాధ్యుల పై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, రైతులు కోరుతున్నారు. ఈ విషయాలను తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా... తాను కడపజిల్లా నుంచి ఎన్నికల విధుల కోసం వచ్చానని తెలిపారు. తన హయాంలో అవినీతి అక్రమాలు జరగలేదన్నారు. గతంలో ఏం జరిగిందో తనకు తెలియదని ఆయన వివరించారు.

కార్గిల్ యుద్ధంలో పాల్గొనడం నా అదృష్టం

విశ్రాంత కెప్టెన్ నంజిరెడ్డి



మడకశిరటౌన్, జూలై 25: దేశ సేవ చేయడం ఓ అదృష్టం... 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో తాను పాల్గొనడం తనకెంతో అదృష్టంగా భావిస్తున్నానని విశ్రాంత సైనిక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, కెప్టెన్ నంజిరెడ్డి అన్నారు. ఆయన గురువారం స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. కార్గిల్ యుద్ధం జరిగి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆ యుద్ధంలో పాల్గొన్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. అప్పట్లో ఎదురైన సంఘటనలను ఆయన వివరించారు.

ఉపాధిలో రూ.46,564 రికవరీకి ఆదేశాలు

గోరంట్ల, జూలై 25: మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో రూ.46,564 రికవరీకి అధికారులు గురువారం ఆదేశించారు. ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద గురువారం ప్రజావేదిక నిర్వహించారు. సామాజిక తనఖీ బృందం తమ విచారణలో వెలుగు చూసిన వాస్తవాలను అధికారుల ఎదుట వివరించారు. గత యేడాది ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్, సర్వశిక్షఅభియాన్ ద్వారా జరిగిన 1916 పనులు, పింఛన్లపై పదిరోజులుగా తనిఖీ బృందాలు గ్రామల్లో విచారణ చేశారు. ఇందులో 1916 పనులకు గాను వేతనాల రూపంలో రూ. 6, 01, 58, 317, మెటిరీయల్ రూపంలో రూ.3,15, 35, 507 ప్రకారం మొత్తం రూ.9,16,93,824 ఖర్చు చేశారు. వాటికి సంబంధించి పరిశీలనలో తేలిన రూ.46,564ను సంబంధిత అధికారుల నుంచి రికవరీ చేయాలని నిర్ధారించారు. ఈకార్యక్రమంలో డ్వామాపీడీ విజయేంద్ర ప్రసాద్, ఏపీడీ శివానంద్‌నాయక్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎస్ఆర్‌పీ తిరుమలేష్, ఏపీఎం నారాయణ, ఏపీఓ వరప్రసాద్, డీఆర్‌పీలు, ఉపాధి, సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

వాంతులు, విరేచనాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ భార్గవ్

మడకశిర (అమరాపురం), జూలై 25: అమరాపురం మండల పరిధిలోని హేమావతి పంచాయతీ కెంకెర గ్రామంలో స్టాప్ డయేరియా(వాంతులు, విరేచనాల)పై పీహెచ్‌సీ డాక్టర్ భార్గవ్ అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల పరిశుభ్రత, రక్షిత మంచినీటి వాడకం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కొద్ది కొద్దిగా వాంతులు, విరేచనాలు అవుతున్న వారికి వైద్యసేవలు అందించారు. వాంతులు, విరేచనాలు ఎక్కువగా ఉన్నవారికి ఇతర ప్రాంతాలకు పంపిస్తున్నామని తెలిపారు. కొద్దిగా వాంతులు విరేచనాలు అవుతున్న వారికి ఆస్పత్రిలోనే చికిత్స అందిస్తున్నామని డాక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌అసిస్టెంట్‌లు నాగరాజు, ఎంఎల్ఎస్‌టి చంద్రశేఖర్, ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

దిన్నేహట్టిలో ముగ్గురికి వాంతులు, విరేచనాలు

గుడిబండ, జూలై 25 : మండలంలోని దిన్నేహట్టి గ్రామంలో గురువారం వాంతులు, విరేచనాలై ముగ్గురు ఆసుపత్రి పాలయ్యారు. గ్రామానికి చెందిన చిత్తమ్మ, చిగరంగమ్మ, మరొకరు వాంతులు విరేచనాలతో మొదట గుడిబండ ఆసుపత్రిలో, అనంతరం మడకశిర ఆసుపత్రిలో చికిత్సలు పొందారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్నట్లు బాధితులు తెలిపారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రమాదంలో గాయపడ్డ డ్రైవర్లకు చేయూత

పెనుకొండ రూరల్, జూలై 25: ఇటీవల వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వాహనాల డ్రైవర్ల కుటుంబాలకు ఆల్ ఆంధ్ర డ్రైవర్స్ క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేయూత నందించారు. స్థానికంగా వివిధ ప్రైవేటు కంపెనీల్లో కాంట్రాక్ట్ డ్రైవర్లుగా పనిచేస్తున్న నాగేంద్ర, దేవరాజు వేర్వేరు ద్విచక్రవాహన ప్రమాదాల్లో గాయపడ్డారు. దీంతో అసోసియేషన్ ఆధ్వర్యంలో నాయకులు వారి ఇళ్ల వద్దకు వెళ్లి నాగేంద్రకు రూ.50వేలు, దేవరాజుకు రూ.20వేలు అందజేశారు. అలాగే రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రంజిత్‌నాయక్ కుమారుడి చదువుకు రూ.50వేలు అందించారు. అసోసియేషన్ నాయకులు గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి..

మంత్రి లోకేశ్‌కు 1996 డీఎస్సీ క్వాలిఫైడ్ నిరుద్యోగుల వినతి

గోరంట్ల, జూలై 25: తమకు న్యాయం చేయాలని రాష్ట్రంలో 1996 డీఎస్సీ క్వాలిఫైడ్ నిరుద్యోగులు విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. క్వాలిఫైడ్ నిరుద్యోగుల అసోసియేషన్ సభ్యులు గోరం ట్లకు చెందిన ఆజాద్ ఆధ్వర్యంలో అమరా వతికి వెళ్లి బుధవారం మంత్రిని కలిశారు. గత వైసీపీ ప్రభుత్వం మినిమమ్ టైమ్ స్కేల్ పద్ధతిలో 1998 డీఎస్సీ క్వాలిఫైడ్స్‌ను ఉపాధ్యాయులుగా నియమించి, తమకు అన్యాయం చేసిందని ఫిర్యాదు చేసినట్లు వారు గురువారం ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన తమను ఆదుకోవాలని కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. అనంతరం వారు తమ సమస్యపై రాష్ట్ర మంత్రులు సవిత, అచ్చన్నాయుడు, అనగాని సత్యప్రసాద్‌ను విడివిడిగా కలిసి వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో క్వాలిఫైడ్ నిరుద్యోగులు గోపాల్, నందకూమార్, ఫణీంద్రశర్మ, హనుమంతరాయుడు, ఉమామహేశ్వర్, లక్ష్మణ్‌బాబు, రవి, మాచర్ల వెంకటరెడ్డి, ఏకాంబరం తదితరులున్నారు.



మంత్రి సవితకు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

కత్తెర పురుగు నివారణకు సూచనలు

హిందూపురం(పరిగి), జూలై 25 : పరిగి మండల పరిధిలో ఈ ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటను కత్తెర పురుగు అధిక స్థాయిలో ఆశించింది. దీంతో వ్యవసాయాధికారి విజయభారతి గురువారం మండలంలోని బోరెడ్డిపల్లి గ్రామ పొలాలను పరిశీలించారు. కత్తెరపురుగును నివారించడానికి ఇమామెక్టిన్ బెంజోయేట్ 80గ్రాములను లీటరు నీటిలో కలిపి ఎకరానికి మొక్క సుడులలో పడేవిధంగా పిచికారి చేయాలని సూచించారు. పంట వేసిన 30రోజుల్లోగా భూమిలో తేమ ఉన్నప్పుడు పోస్ట్ ఎమర్జెన్సీ వీడిసైడ్ మందును పిచికారి చేస్తే కలుపు సమస్యను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి లలిత, పావని, వీహెచ్ఏ శివ, రైతులు పాల్గొన్నారు.

చీడపీడల నివారణకు చర్యలు చేపట్టండి : ఏఓ

అగళి, జూలై 25: చీడపీడల నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి శేఖర్‌నాయక్ పేర్కొన్నారు. మండలంలోని మధూడి, ఇనగలూరు, తునసన పల్లి, డొక్కలపల్లి గ్రామాలో ఆయన గురువారం పర్యటించారు. ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి, చీడపీడలను గుర్తించారు. ఆయన రైతులతో మాట్లాడారు. చీడపీడల నివారణకు పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది రవీంద్రకుమార్, లక్ష్మీకాంత్, చంపరాజు తదితరులు ఉన్నారు.

'పేద విద్యార్థులకు అండ'

పావగడ, జూలై 25: పేద విద్యార్థుల చదువులకు తేజస్ చారిటబుల్, ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అన్నివిధాలా ప్రయత్నిస్తుందని సంస్థ కార్యదర్శి మాజీ జడ్పీటీసీ సభ్యురాలు గాయిత్రిబాయి తెలిపారు. పట్టణంలోని హర్షిత కన్వెన్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన పీయూసీలో అధిక మార్కులు పొందిన వి ద్యార్థులకు ప్రతిభా పురస్కారాల పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా 39మంది విద్యార్థులకు పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సోమ్లానాయక్, ట్రస్ట్ సభ్యులు తేజస్, హర్షిత, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం

పెనుకొండ, జూలై 25: పట్టణంలోని జీఐసీ కాలనీలో నివసిస్తున్న టీడీపీ కార్యకర్త సావిత్రమ్మ గురువారం ఉదయం మృతిచెందింది. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు జీఐసీ కాలనీలోని మృతురాలి గృహానికి వెళ్లి భౌతికకాయాన్ని దర్శించి పూలమాలలువేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. పట్టణ కన్వీనర్ శ్రీరాములు, త్రివేంద్రనాయుడు, బాబుల్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, తోటగేరిశీన, నరేంద్ర, బోయ నంజుండ, కురుబ నంజుండ, షౌకత్, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా మండల సమావేశం

లేపాక్షి, జూలై 25: మండలంలోని సమస్యల పరిష్కారం, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రతి మూడునెలలకోసారి మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తారు. ఈ మేరకు గురువారం స్థానిక స్త్రీశక్తిభవన్‌లో ఎంపీడీఓ వాసుదేవగుప్త ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులపై చర్చించాల్సిన ప్రజాప్రతినిధులు ఆ అంశాన్ని పక్కన పెట్టారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో గత వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన పలువురు యానిమేటర్లను మధ్యాహ్న భోజన ఏజెన్సీలను మారుస్తున్నారనే విషయంపై చర్చ ప్రారంభించారు. అభివృద్ధి సమీక్షలు పక్కనబెట్టి కేవలం వారిని తొలగింపుపైనే సమావేశం మొత్తం నడిచింది. వారిని ఎందుకు తొలగిస్తున్నారంటూ వైసీపీ ప్రజాప్రతినిధులు ఆ శాఖ అధికారులను నిలదీశారు. దీనిపై అధికారులు స్పందిస్తూ స్వచ్ఛందంగా వారే తప్పుకున్నారని తాము ఎవరిపైనా ఒత్తిడి తీసుకురా లేదని సమాధానమిచ్చారు. దీంతో సమావేశాం రసాభాసగా మారింది. చివరకు ఎంపీడీఓ వాసుదేవ గుప్తా మాట్లాడుతూ... సమావేశంలో అభివృద్ధి పనులపై మాట్లాడాలని ఏవైనా సమస్యలుంటే కలెక్టర్‌కు ఫిర్యాదుచేయాలని సూచించారు. అనంతరం అన్నిశాఖల అధికారులు ప్రభుత్వం తరుపున వారు చేపట్టే పనులపై సమీక్షించారు. ఈ కార్యక్రమానికి ఆర్అండ్‌బీ అధికారులు, ఎక్సైజ్ సిబ్బంది, ఉపాధి సిబ్బంది గైర్హాజరయ్యారు. వైస్ ఎంపీపీలు అంజినరెడ్డి, లీలావతి, తహసీల్దార్ బాలనరసింహులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వాసుదేవ గుప్తా

సబ్‌కలెక్టర్ విస్తృత పర్యటన

రెవెన్యూ రికార్డుల భద్రతలో నిర్లక్ష్యం వద్దని సూచన



లేపాక్షి తహసీల్దార్ కార్యాలయంలో తలుపులు లేని కిటికీలను మూసివేయిస్తున్న సబ్ కలెక్టర్ అపూర్వ భరత్

చిలమత్తూరు/ లేపాక్షి/ హిందూపురం(సోమందేపల్లి), జూలై 25: రెవెన్యూ రికార్డులను భద్రపరచడంలో ఎటువంటి నిర్లక్ష్యం చూపరాదని పెనుకొండ సబ్‌కలెక్టర్ భరత్ మండల అధికారులకు సూచించారు. ఆయన గురువారం చిలమత్తూరు, లేపాక్షి, సోమందేపల్లి మండలాల తహసీల్దార్ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రెవెన్యూ రికార్డుల గదిని పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, వాటి భద్రత పూర్తిగా అధికారులదే అన్నారు. వాటిని పోగొట్టడం, దుర్వినియోగం చేయడం తగదన్నారు. రికార్డులు కలిగిన గదిల్లోకి ఇతరులు వెళ్లకుండా చూడాలన్నారు. కార్యాలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే వినతులు, వాటి పరిష్కారాలపై సరైన రికార్డులు నిర్వహించాలన్నారు. లేపాక్షి తహసీల్దార్ కార్యాలయం వెనుక పరిశీలించి, కిటికీలకు డోర్లు లేకపోవడంతో అప్పటికప్పుడే ఇటుకలతో మూయించారు. ఈ కార్యక్రమాల్లో చిలమత్తూరు తహసీల్దార్ భాగ్యలత, లేపాక్షి తహసీల్దార్ బాలనరసింహులు, సోమందేపల్లి తహసీల్దార్ అంజనాదేవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలు ఇప్పించండి

● సబ్ కలెక్టర్‌కు రైతుల వినతి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నడింపల్లి రైతులు

హిందూపురం(సోమందేపల్లి), జూలై 25: తాము సాగు భూములకు పట్టాలు ఇప్పించాలని సంబంధిత రైతులు సబ్ కలెక్టర్ అపూర్వ భరత్‌కు వినతిపత్రం అందిం చారు. సోమందేపల్లి తహసీల్దార్ కార్యాలయం తనిఖీకి వచ్చిన సబ్‌కలెక్టర్‌ను గురువారం మండల పరిధిలోని నడింపల్లికి చెందిన పలువురు రైతులు కలిసి తమ సమస్యను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తాము 45ఏళ్లుగా నడింపల్లిలో సాగు చేసుకుంటున్న భూములకు పాసుపుస్తకాలు పెండింగ్‌లో ఉండటంతో ప్రభుత్వ పథకాలు అందడంలేదన్నారు. రుణాలు, సబ్సిడీలు అందక ఇబ్బందులు పడుతున్నామన్నారు. కొంతమంది తమ పొలాల్లోకి రానీయకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. తమకు పాసుపుస్తకాలు వచ్చేలా చూడాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. దీనిపై సబ్ కలెక్టర్ స్పందిస్తూ విచారించి వారికి న్యాయం జరిగేలా చూడాలని స్థానిక రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు రొద్దం విద్యార్థిని



విద్యార్థిని సుకన్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెనుకొండ రూరల్, జూలై 25: రొద్దం మండలంలోని నారనాగేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని సుకన్య రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైంది. అనంతపురం ఆర్డీటీ మైదానంలో బుధవారం జరిగిన జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో నారనాగేపల్లి జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్న సుకన్య పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచిందని హెచ్ఎం రామాంజినేయులు తెలిపారు. విద్యార్థిని రాష్ట్రస్థాయిలో ఆగస్టు 10నుంచి 13వరకు జరిగే పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఆ విద్యార్థినిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు అభినందించారు.

జూనియర్ బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లాకు మూడో స్థానం



ట్రోఫీ అందుకుంటున్న శ్రీసత్యసాయి జిల్లా జట్టు

హిందూపురం అర్బన్, జూలై 50: రాష్ట్రస్థాయి బాలికల సబ్ జూనియర్స్ ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు తృతీయ స్థానం కైవసం చేసుకుంది. ఈ నెల 23నుంచి గురువారం వరకు మూడు రోజుల పాటు తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీలో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ ఫుట్‌బాల్ పోటీలు జరిగాయి. రాష్ట్ర నలుమూలల నుంచి 11 జట్లు పాల్గొనగా జిల్లా జట్టు కర్నూలు జట్టుపై 1-0 తేడాతో విజయం సాధించి మూడో స్థానంలో నిలిచిందని జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు జేవీ అనిల్ గురువారం తెలిపారు. వారి వెంట జట్టు కార్యదర్శి మహ్మద్ సలీమ్, కోచ్ అయేషా, మేనేజర్ మౌనిక ఉన్నటు తెలిపారు.

'బాలికల చదువుకు ప్రోత్సాహం అందిస్తాం'

హిందూపురం అర్బన్ జూలై 25: విప్రో సంస్థ అధినేత అజిమ్ ప్రేమ్‌జీ ప్రకటించిన మేరకు పాలిటెక్నిక్ డిప్లొమా చేస్తున్న ఆర్థికంగా వెనుకబడిన బాలికలను గుర్తించి ఆర్థిక సహాయం అందజేస్తామని విప్రో హెచ్ఆర్ హెడ్ రామకృష్ణ తెలిపారు. చదువు పూర్తి అయిన తరువాత సంస్థలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆయనతో పాటు సంస్థ ప్రతినిధులు గురువారం తూమకుంట, సంతేబిదనూర్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులతో సమావేశ మయ్యారు. ఆడపిల్లల చదువుకు, అభివృద్ధికి అవసరమైన సహాయ, సహకారాలను అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు.

28న ఉచిత గుండె వైద్య శిబిరం

హిందూపురం (సోమందేపల్లి): సోమందేపల్లి మండలం వెలిదడకల గ్రామంలో ఈనెల 28న ఉచిత గుండె వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీసత్యసాయి భజనమండలి సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.